తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice    వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

16-10-2026

శుక్రవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 248

PUBLISHED FROM HYDERABAD    పేజీలు- 8    వెల:రూ.4 /–



## తెలంగాణకే ప్రత్యేకమైన పూల పండుగ

# బతుకమ్మ

పూలను ఓ ఆకారంగా పేర్చి దేవుడిగా పూజించడం అనేది ప్రపంచంలో ఎక్కడ కనిపించదు. ఒక్క తెలంగాణలో మాత్రం బతుకమ్మ పేరుతో పూలను పూజించే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది. తెలంగాణలోని ప్రతీ ఆడపడుచు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే బతుకమ్మ పండుగ రానే వచ్చింది. యువతులు, ముత్తైదువులు ఆడుతూ పాడుతూ చూపరులను అలరించే అరుదైన వేడుక ఈ బతుకమ్మ పండగ. మహాలయ అమవాస్యతో ప్రారంభమై 9 రోజుల పాటు వైభవంగా సాగే ఈ పండగ శనివారం ప్రారంభంకానుంది.

## న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు: సీజేఐ

- రాహుల్‌గాంధీ పిటిషన్ విచారణలో సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు పాదయాత్రపై గౌరవ్ భాటియా అభ్యంతరం
- ఒత్తిళ్లకు న్యాయవ్యవస్థ తలొగ్గదన్న ప్రధాన న్యాయమూర్తి

3



## మతం మారితే కుల రిజర్వేషన్ వర్తించదు: సుప్రీంకోర్టు

- ముస్లిం బీసీ రిజర్వేషన్లపై తమిళనాడు ప్రభుత్వానికి ఎదురుదెబ్బ
- మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- మత మార్పిడితో కుల గుర్తింపు స్వయంచాలకంగా రాదని స్పష్టీకరణ

3





# ఎల్ నినో చాలా తీవ్రమైంది!



### నీటి, పశుగ్రాసం కొరత ఉండొద్దు

- ఎల్‌నినో ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ చేపట్టాలి
- ఏజెన్సీ ప్రాంతాల్లో 125 రోజుల 'ఉపాధి' పనులు
- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

2

- ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళిక
- నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలి
- రైతులు, ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలి
- ఎంత ఖర్చయినా విద్యుత్ కొనుగోలు చేస్తున్నాం
- వొచ్చే సీజన్లో రైతులు వరి పంట వేయొద్దు
- తాగునీటికే క్లిష్టమైన పరిస్థితి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 15 సిరి న్యూస్:** ప్రస్తుత ఎల్నినోను ఎదుర్కొనడానికి అందుబాటులో ఉన్న మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో చర్చించి ఒక కార్యాచరణను రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఇది గతంలో వొచ్చిన ఎల్నినోలకంటే తీవ్రమైందన్నారు. నీటికొరత ఏర్పడే పరిస్థితి వున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరించిన నేపథ్యంలో ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సాగు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ కొరత కూడా ఏర్పడుతోంది. వానాకాలంలోనే ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. రాష్ట్రంలో 13 లక్షల ఎకరాల్లో వరి కాకుండా ఇతర పంటలు వేశారు. 56 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. అక్టోబర్ నెలలో 15 వేల మెగావాట్లు ఉండాల్సిన విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగింది. అంటే అదనంగా 5 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలోని

మిగతా 2వ పేజీలో..

## సంపద సృష్టికర్తలకు సహకారం



- రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి
- సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు గార్డియన్‌గా ఉంటా
- పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం భట్టి భరోసా

**హైదరాబాద్, అక్టోబర్ 15 సిరి న్యూస్:** పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు సహకారం అందించేందుకు కృషిచేస్తానని స్పష్టం చేశారు. హైటెక్స్‌లో జరుగుతున్న సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్ 2026 రెండో రోజు

మిగతా 3వ పేజీలో..

## బీమా అమలు చేయకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తాం

- బీమా బంద్ తో రోడ్డునపడ్డ మూడువేల రైతు కుటుంబాలు
- రైతులకు నీళ్లు, కరెంటు ఇవ్వలేక చేతులెత్తేసిన ప్రభుత్వం
- సీఎం, డిప్యూటీ సీఎంల వైఫల్యం రాష్ట్రానికి శాపం
- అధికార్లను కాదు మిమ్మల్ని సస్పెండ్ చేయాలి



3

## కావాలనే కృత్రిమ బొగ్గు కొరత

- బొగ్గు దిగుమతి పేరుతో రూ.3వేల కోట్ల కుంభకోణం
- కావాలనే కృత్రిమ బొగ్గు కొరత
- కరెంట్ సంక్షోభం సృష్టించిందే రేవంత్
- మొత్తం స్కాంపై స్వతంత్ర విచారణ జరపాలి
- సింరేణికి రూ.60వేల కోట్ల బకాయిలకు ఎగనామం
- దిగుమతి చేసుకునే బొగ్గుకు టన్నుకు రూ.1500 కమీషన్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2



## బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే సింగరేణికి నష్టం

- వేలంలో పాల్గొనక కోయగూడెం, సత్తుపల్లి గనులను కోల్పోయింది
- బహుళ అంచెల నిఘా వ్యవస్థతో బొగ్గు మాయమయ్యే ప్రసక్తే లేదు
- రెండేళ్లలోనే నైనీ, తాడిచర్ల-2 గనులకు మైనింగ్ అనుమతులు సాధించాం
- ఆధారాలు ఉంటే బయటపెట్టాలి, లేకపోతే దుష్ప్రచారం మానాలి
- బీఆర్ఎస్ ఆరోపణలకు మంత్రి శ్రీధర్‌బాబు ఘాటు కౌంటర్

2

## 22ఏతో భూ యజమానులకు ఇబ్బందులు

- ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న ప్రభుత్వం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

2





## నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై రేవంత్ సర్కార్ చర్యలు

- యాదాద్రి ప్లాంట్ సీఈపై సస్పెన్షన్ వేటు
- నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై రేవంత్ సర్కార్ చర్యలు
- ప్లాంట్ పర్యవేక్షణకు ఐదుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- క్షేత్రస్థాయిలోనే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాల సాధనపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

3

## నేడు 41 బార్లకు లక్కీ డ్రా..

- ఉదయం 11 గంటలకు లైసెన్సుల ఎంపిక
- టీసీయూఆర్ పరిధిలోని 14 బార్లకు 4,251 అప్లికేషన్లు
- ఇతర ప్రాంతాల్లోని 27 బార్లకు 4,519 దరఖాస్తులు
- ఉదయం 9 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని అధికారుల సూచన

2





## నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలి

- ప్రామాణిక అర్బన్ పోలీసింగ్ అవసరం
- నేరాల కట్టడికి నిరంతర గస్తీ
- స్పందించే తీరును బట్టే పోలీసుల పనితీరుపై అంచనా
- మల్కాజిగిరి కమిషనరేట్ సమీక్షలో డీజీపీ ఆనంద్

**హైదరాబాద్, అక్టోబరు 15, సిరి న్యూస్:** నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్, పటిష్ఠ నిఘా, సత్వర స్పందన కీలకమని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. అర్బన్ పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, వినూత్న విధానాలను వినియోగిస్తూ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. నేరాల స్వభావం, ప్రాంతాల వారీ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని గస్తీ, నిఘా పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్‌లో సీపీ సుమతి, ఇతర పోలీసు అధికారులతో గురువారంనిర్వహించిన సమీక్షలో ఆయన నేరాల నియంత్రణ, దర్యాప్తు, రాత్రి గస్తీ, రోడ్డు

మిగతా 3వ పేజీలో..

## పండగల వేళ నిరసనలతో వ్యాపారులకు నష్టం

- దీపావళి వరకు ఆందోళనలకు అనుమతివ్వొద్దని అమిత్ షాకు వ్యాపార సంఘం లేఖ
- అక్టోబర్ 16న కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ నిరసన
- అక్టోబర్ 10 ఆందోళనతో రూ.2,000 కోట్ల నష్టం
- ఢిల్లీలో 20 లక్షల మంది వ్యాపారులపై ప్రభావం పడే అవకాశం

3

# బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే సింగరేణికి నష్టం

హైదరాబాద్, అక్టోబర్ 15 సిరి న్యూస్:

సింగరేణి సంస్థపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో, పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే సింగరేణికి తీరని నష్టం జరిగిందని, ఆ తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఏటా సగటున సుమారు 4 మిలియన్ టన్నుల జీ9 గ్రేడ్ బొగ్గు సరఫరా అయిందని మంత్రి తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సింగరేణి 25 మిలియన్ టన్నులకుపైగా బొగ్గు సరఫరా చేయగా, అందులో జీ9 గ్రేడ్ బొగ్గు 1.20 మిలియన్ టన్నులు మాత్రమేనని, అందులోనూ 0.52 మిలియన్ టన్నులు తెలంగాణ జెన్కోకే వెళ్ళింద ని చెప్పారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు ఏటా 14 మిలియన్ టన్నుల జీ9 బొగ్గు సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం, దానికి తగ్గట్టుగా కొత్త గనులను ఎందుకు తెచ్చి ఉత్పత్తిని పెంచలేకపోయిందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన వేలంలో సింగరేణిని పాల్గొననివ్వకపోవడం వల్లే కీలకమైన కోయగూడెం3, సత్తుపల్లి3 బ్లాకులు దక్కలేదని, ఫలితంగా ఏటా 10 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అవకాశాన్ని సంస్థ కోల్పోయిందన్నారు. అలాగే 14 గనులు మూతపడటంతో మరో 15 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోవడం వాస్తవం కాదా అని నిలదీశారు.

**రెండేళ్లలోనే నైనీ, తాడిచర్ల-2 అనుమతులు సాధించాం**

తమ ప్రజా ప్రభుత్వం వచ్చిన కేవలం రెండేళ్లలోనే నైనీ బొగ్గు గనికి అనుమతులు సాధించి ఉత్పత్తికి మార్గం సుగమం చేశామని శ్రీధర్‌బాబు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నైనీ వైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. 2013లో యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన తాడిచర్ల బ్లాక్2కు మైనింగ్ అనుమతులు తెచ్చామని, వేలం ద్వారా మణుగూరు పీకే ఓసీ2 డిప్సైడ్ బ్లాక్‌ను సింగరేణికి దక్కించామని వివరించారు. వీటన్నింటి ద్వారా రానున్న రోజుల్లో సంస్థ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేశారు.

**బహుళ అంచెల నిఘా వ్యవస్థ – బొగ్గు మాయం అసాధ్యం**

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, లోడింగ్, రవాణా, తూకం నుంచి పంపిణీ వరకు ప్రతీ దశలోనూ సాంకేతిక ఆధారిత బహుళ అంచెల నిఘా వ్యవస్థ అమలులో ఉందని మంత్రి తెలిపారు. ఎస్ఏపీ/ఈఆర్‌పీ అనుసంధానం, జీపీఎస్/జీపీఆర్ఎస్ ద్వారా వాహనాల ట్రాకింగ్, జియోఫెన్సింగ్, ఎలక్ట్రానిక్ తూకం, ఆకస్మిక తనిఖీలు, బొగ్గు చోరీ నిరోధక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని చెప్పారు. ప్రతీ టన్ను బొగ్గుకు పక్కా లెక్క ఉన్న ఈ వ్యవస్థలో బొగ్గు మాయమయ్యే అవకాశమే లేదన్నారు. బీఆర్ఎస్ నాయకుల వద్ద ఆధారాలు ఉంటే బయట పెట్టాలని, లేకపోతే సింగరేణి కార్మికులు, అధికారుల నిజాయతీపై బురద చల్లడం మానాలని శ్రీధర్‌బాబు హెచ్చరించారు.

**సంస్థ ప్రయోజనం కోసమే సైట్ విజిట్ నిబంధన**

ఓవర్ బర్డెన్ తొలగింపు టెండర్లలో 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధనను పారదర్శకత కోసం, సంస్థ శ్రేయస్సు కోసమే ప్రవేశపెట్టామని మంత్రి సమర్థించుకున్నారు. గతంలో కాంట్రాక్టర్లు క్షేత్రస్థాయి భౌగోళిక పరిస్థితులు చూడకుండానే టెండర్లు వేసి, తర్వాత పనులు చేయలేక మధ్యలోనే వదిలేసి వెళ్లేవారని, దాని వల్ల సింగరేణికే నష్టం జరిగేదని గుర్తుచేశారు. ఈ నిబంధన వల్ల సమర్థులైన కాంట్రాక్టర్లు ఎలాంటి అవాంతరాలు లేకుండా పనులు పూర్తిచేస్తున్నారని తెలిపారు. జీఎండీసీగుజరాత్, జీఐపీసీఎల్, ఎన్ఎండీసీ, కొన్ని సోలార్ ప్రాజెక్టులు,ఈపీసీ కాంట్రాక్టుల్లోనూ, అలాగే 2018, 2021, 2023లో గత ప్రభుత్వ హయాంలోనూ సీఎంపీడీఐ సలహా మేరకు ఈ నిబంధన అమల్లో ఉందని, అప్పుడు సరైనదైన నిబంధన ఇప్పుడు తప్పెలా అవుతుందని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు.

**సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నది బీఆర్ఎస్సే**

పదేళ్ల పాలనలో బీఆర్ ఎస్ సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నదని, విద్యుత్ సంస్థల పేరుతో రూ.వేల కోట్ల బకాయిలు పెట్టి సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టిందని శ్రీధర్‌బాబు విమర్శించారు. కాళేశ్వరం నుంచి మిషన్ భగీరథ వరకు రూ.లక్ష కోట్ల కుంభకోణాలకు పాల్పడిన వారు అవినీతి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

# నేడు 41 బార్లకు లక్కీ డ్రా..

హైదరాబాద్, అక్టోబర్ 15 సిరి న్యూస్:

తెలంగాణలో కొత్త బార్ల లైసెన్సుల కేటాయింపునకు ఎక్సైజ్ శాఖ సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 41 బార్లకు వచ్చిన 8,770 దరఖాస్తుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు లక్కీ డ్రా నిర్వహించనున్నారు. దరఖాస్తుదారుల సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టి లైసెన్సులు కేటాయించనున్నారు. టీసీయూఆర్ పరిధిలోని 14 బార్ల కోసం 4,251 దరఖాస్తులు రాగా, ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని 27 బార్లకు 4,519 అప్లికేషన్లు వచ్చాయి. పరిమిత సంఖ్యలో ఉన్న బార్లకు భారీగా దరఖాస్తులు రావడంతో లైసెన్సులు ఎవరికి దక్కుతాయనే ఆసక్తి నెలకొంది.

**టీసీయూఆర్ బార్లకు డ్రా**

టీసీయూఆర్ పరిధిలోని 14 బార్లకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ లక్కీ డ్రా నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షిస్తారు. గండిపేట మండలం నార్సింగ్‌లోని ది అడ్రస్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్‌లో డ్రా నిర్వహించనున్నట్లు సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్ వెల్లడించారు. మిగిలిన ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లు లక్కీ డ్రా ద్వారా లైసెన్సుదారులను ఎంపిక చేయనున్నారు.

**ఉదయం 9 గంటలకే చేరుకోవాలి**

లక్కీ డ్రాకు సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తుదారులకు వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా పంపించినట్లు అధికారులు తెలిపారు. వారంతా శుక్రవారం ఉదయం 9 గంటలకల్లా సంబంధిత కేంద్రాలకు చేరుకోవాలని డిప్యూటీ కమిషనర్లు సూచించారు. డ్రా పూర్తయితే 41 బార్లకు కొత్త లైసెన్సులు ఎవరికి దక్కనున్నాయో స్పష్టత రానుంది.

# 22-ఏతో భూ యజమానులకు ఇబ్బందులు

హైదరాబాద్, అక్టోబర్ 15 సిరి న్యూస్:

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ చాలా చోట్ల 2030 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారన్నారు. తమ భూమి తమకు ఉంటుందో లేదోనన్న ఆందోళనతో బాధితులు కలెక్టరేట్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ పేరుతో అవినీతి జరుగుతోందని, నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించుకోవాలంటే లంచాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. ఇదే నేపథ్యంలో రాష్ట్రంలో ఇటీవల అనేకమంది రెవెన్యూ అధికారులను ఏసీబీ పట్టుకుంటున్న ఘటనలు కూడా చూస్తున్నామన్నారు. శామీర్‌పేట మండలం బొమ్రాస్‌పేటలో సుమారు 1,500 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, ఆ రైతులు తమ సమస్య పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లోనూ ఒక సర్వే నంబరులో ఏదో ఒక ప్లాట్ ప్రభుత్వ భూమి ఉందనే కారణంతో ఆ సర్వే నంబర్‌లోని మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేరుస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతుండగా, బడా బాబులు, బిల్డర్లు లాభపడుతున్నారన్నారు. ప్రజల భూముల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం నిషేధిత జాబితా పేరుతో వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. 22ఏ జాబితాలో భూముల చేర్పు, తొలగింపుల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ అంశానికి సంబంధించిన పలు కీలక వివరాలను బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారు. 22ఏ సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు.

# ఎల్ నినో చాలా తీవ్రమైంది!

మొదటిపేజీ తరువాయి

30 లక్షల పంప్‌సెట్లు ఆన్ అయ్యాయి.మార్చిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత అక్టోబర్‌లో ఉంది.డిప్యూటీ సీఎం భట్టి, విద్యుత్ శాఖ అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడం ద్వారా విద్యుత్ శాఖ మంత్రి, అధికారులు చిత్తశుద్ధిని చూపించారు.ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ డిమాండ్ పెరిగింది.ఈ రెండేళ్లలో ఆరు, ఏడు వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది.విద్యుత్ శాఖ సమర్థవంతంగా పనిచేసి రైతులకు, ఇతర అవసరాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది.మరో 20 రోజుల్లో వానాకాలం పంటలు కోతకు వస్తాయి.చేతికొచ్చిన పంట ఎండిపోకూడదన్న లక్ష్యంతో మార్కెట్‌లో ఏ ధరకు విద్యుత్ దొరికినా కొనుగోలు చేసి రైతులకు అందిస్తున్నామన్నారు.కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు కూడా విద్యుత్ కొరతతో ఉన్నాయి. రైతులు మనోధైర్యం కోల్పోకుండా మా ప్రభుత్వం విద్యుత్‌ను సరఫరా చేస్తోంది.గృహ అవసరాలకు తగినట్లుగా విద్యుత్‌ను అందిస్తున్నాం.కృష్ణా బేసిన్‌లో 72 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి.గోదావరి బేసిన్‌లో 40 శాతం నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి.23 శాతం లోటు వర్షపాతం ఉంది.అన్ని రిజర్వాయర్లు వట్టిపోయే దశలో ఉన్నాయి.24 వేల గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాల్సి ఉంది.తాగునీటికే ఈ రోజు క్లిష్టమైన పరిస్థితి ఉందని గుర్తు చేశారు.

**ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం**

చలికాలం ఎండాకాలంలా ఉంది. వచ్చే 8 నుంచి 10 నెలల్లో తలెత్తే పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.కేంద్రం నుంచి ఎలాంటి సహకారం తీసుకోవాలనే దానిపై ఈ రోజు సమావేశంలో చర్చించాం.10 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయే పరిస్థితి ఉందని నివేదికలు వచ్చాయి.ఎట్టి పరిస్థితుల్లోనూ పంటను ఎండిపోనివ్వొద్దని అధికారులను ఆదేశించామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడాలి.సాగుకు నీటిని పొదుపుగా వినియోగించాలి.460 టీఎంసీలు ఉండాల్సిన పరిస్థితుల్లో ఇప్పుడు కేవలం 209 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి .ఈ నీటిని పంటలకు ఇస్తే కేవలం నారుమళ్లకే సరిపోతాయి.ఎల్‌నినోను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.అందుబాటులో ఉన్న 200 టీఎంసీల నీళ్లను పొదుపుగా వినియోగించుకోవాలి. ఈ నీటిని కేవలం తాగునీటి కోసమే వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.రైతులు పెద్ద మనసు చేసుకుని యాసంగిలో పంటలు వేయడం తగ్గించుకోవాలని కోరారు.చుక్క చుక్కను ఆదా చేసుకోవాలి. వచ్చే సీజన్‌లో వరి వేయడాన్ని వాయిదా వేసుకోవాలి.ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టడానికి కార్యాచరణను రూపొందిస్తున్నాం.గత ఏడాది ఈ సమయంలో 25 వేల మంది ఉపాధి హామీ పనులు చేస్తే, ప్రస్తుతం రెండున్నర లక్షల మంది పనుల్లో పాల్గొంటున్నారు.ఉపాధి హామీ పథకంలో చెరువులు, కుంటలను ప్రాధాన్యతగా తీసుకుని మరమ్మతులు చేయాలి.వానాకాలంలో నష్టపోయిన పంటతో పాటు వచ్చే సీజన్‌లో పంట వేయకుండా నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలన్నారు.కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఇచ్చే పథకాల ద్వారా రైతులను ఆదుకోవాలి.కేంద్ర ప్రభుత్వం నుంచి ఉదారంగా సాయం తీసుకునే అంశంపై అధికారులు నివేదికలు తయారు చేయాలి.

**ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం**

ఓవర్‌లోడ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతోంది. ప్రస్తుతం 20 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. విద్యుత్ ఉత్పత్తి చేయగలిగిన రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను తీసుకుని, మిగిలిన రాష్ట్రాలకు తక్కువ ధరకు కేంద్రం అందించాలి. కోవిడ్ సమయంలో ప్రధాని మోదీ ఏం చేయమన్నా చేశాం. ఆ రోజు విధానాలు, జెండాలు మేం చూడలేదు. ఒకే విధానంలో ముందుకు వెళ్లాలన్న ప్రధాని అప్పీల్‌కు అనుగుణంగా ముందుకు వచ్చాం. ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అదే స్ఫూర్తితో వ్యవహరించాలి. అన్ని పార్టీలు, ప్రతి పౌరుడు ప్రభుత్వానికి సహకరించాలి. ప్రభుత్వ సూచనలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి. ప్రకృతి విపత్తును కలిసికట్టుగా నిలబడి ఎదుర్కోవాలి. అందరి సహకారం ప్రభుత్వానికి కావాలి. మీడియా సహకారం ప్రభుత్వానికి వందకు వంద శాతం అవసరం. ప్రభుత్వం నుంచి మీడియా కోసం ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తాం. టోల్ ఫ్రీ నంబర్ ఇస్తాం. ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు.. అందరితో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తాం. పశువులకు తాగునీరు, పశుగ్రాసం అత్యంత ముఖ్యం. లేకుంటే పిట్టల్లా రాలిపోయే ప్రమాదం ఉంది. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశాం.పేదలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే ఆదుకోవాలన్న కార్యాచరణను రూపొందించాం. ఎల్‌నినోను ఎదుర్కోవడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. ఈ సమస్యను ఎదుర్కోవడంపై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. ప్రభుత్వం నిత్యం దీనిపై అప్రమత్తంగా ఉంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాయకత్వంలో దసరా తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని వివరిస్తాం. ముఖ్యమంత్రి నాయకత్వంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర హోంశాఖ మంత్రిని, ఇతర మంత్రులను కలుస్తాం. ప్రజలను చైతన్యపరచడానికి కళాజాతాలను ఏర్పాటు చేస్తాం. సీనియర్ జర్నలిస్టులు, నిపుణులు పత్రికల్లో వ్యాసాలు రాయాలి. సినీ నటుడు విజయ్ దేవరకొండ ఎల్‌నినోపై ఒక విజ్ఞప్తి చేశారు. మిగిలిన సినీ నటులు, క్రీడాకారులు, కళాకారుల సహకారం తీసుకుని వారితో ప్రజలకు ఒక విజ్ఞప్తి చేయించి అప్రమత్తం చేస్తాం. అందరి సమస్య.. అందరం కలిసి విజయవంతంగా ఎదుర్కోవాలన్నారు.

# నీటి, పశుగ్రాసం కొరత ఉండొద్దు

హైదరాబాద్, అక్టోబర్ 15 సిరి న్యూస్:

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తలెత్తే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు ఇప్పటినుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి కొరత, ఉపాధి సమస్యలు, పశుగ్రాసం కొరత వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి కనీసం 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు. వీబీ జీ రామ్ జీ ద్వారా కరువు నివారణ చర్యలపై బేగంపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. గ్రామంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధి చెందడమే నిజమైన సమగ్ర అభివృద్ధి అని మంత్రి స్పష్టం చేశారు. మారుమూల గిరిజన గ్రామాలు కూడా ఇతర గ్రామాలతో సమానంగా అభివృద్ధి చెందేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గతంలో ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం వివిధ శాఖల సమన్వయంతో చేపట్టిన కార్యక్రమాల స్ఫూర్తితో ప్రస్తుతం కూడా ఐటీడీఏలు, పంచాయతీరాజ్ శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

**వర్షపాతం లోటు నేపథ్యంలో ముందస్తు చర్యలు**

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 నుంచి 18 జిల్లాలు సాధారణ వర్షపాతం కంటే 20 శాతానికిపైగా లోటుతో ఉన్నాయని సదస్సు నివేదిక పేర్కొంది. 18 జిల్లాల పరిధిలోని 320 మండలాలల్లో తీవ్ర ఎల్నినో ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిందని వివరించింది. ఈ సీజన్‌లో ఎల్‌నినో పరిస్థితులు మరింత బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వర్షపాతం లోటు ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వేసవి ప్రభావం ఈసారి దాదాపు ఎనిమిది నెలలపాటు ఎదుర్కోవాల్సి రావచ్చని అన్నారు.

**ఆదివాసీ గిరిజన కుటుంబాలకు 125 రోజుల ఉపాధి కల్పించాలి**

ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రధానంగా ఒకే పంటకు పరిమితమవుతుందని, రెండో పంట సాగు చేసే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని మంత్రి వివరించారు. దీంతో ఆదివాసి గిరిజన కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలకమన్నారు. ప్రతి ఆదివాసీ గిరిజన కుటుంబానికి తప్పనిసరిగా 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే ఐదు నెలల్లో ప్రతి జాబ్ కార్డుకు నెలకు కనీసం రూ.7,500 వేతనం లభించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఆదివాసి గిరిజన నివాస ప్రాంతంలో కనీసం ఒక మేట్‌ను నియమించాలని, వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి పనుల అమలులో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

**ఉపాధి పనులతో గ్రామాలకు శాశ్వత ఆస్తులు**

ఉపాధి హామీ పథకం కింద కేవలం కూలీలకు పని కల్పించడమే కాక గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే శాశ్వత ఆస్తులను సృష్టించాలని మంత్రి సీతక్క సూచించారు. ఉపాధి హామీ కింద అందుబాటులో ఉన్న 370 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలన్నారు. మట్టి, మొరం రహదారులు, గ్రామాలకు వెళ్లే బాటలు, అన్ని కాలాల్లో వినియోగించుకునే రహదారులు, ఊట చెరువులు, పెర్కొలేషన్ ట్యాంకులు, చెరువుల్లో పూడికతీత, కాలువలు, ఫీడర్ ఛానళ్లు, కందకాల తవ్వకం వంటి పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

**పశువులకు నీరు, గ్రాసం అందేలా చర్యలు**

ఏజెన్సీ ప్రాంతాల్లో పశు సంపద ఎక్కువగా ఉంటుందన్న మంత్రి పశువులకు అవసరమైన నీరు, గ్రాసం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో చెక్‌డ్యాంల నిర్మాణం, నీటి సంరక్షణ పనులు చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులను స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తే గ్రామాల అభివృద్ధితో పాటు కరువు ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు.అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే ప్రజల సమస్యలు తెలుస్తాయని, వాటికి తగిన పరిష్కారాలు కనుగొనగలమని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

**సమన్వయంతో ఎల్‌నినోను ఎదుర్కోవాలి**

పంచాయతీరాజ్ శాఖ, ఐటీడీఏలు, పేదరిక నిర్మూలన సంస్థలు సమన్వయంతో పనిచేసి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవాలని మంత్రి పిలుపునిచ్చారు. సర్పంచులు, క్షేత్రస్థాయి సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులను భాగస్వాములను చేస్తూ ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి కల్పనతోపాటు నీటి సంరక్షణ, పశుగ్రాసం అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అదనపు డీఆర్‌డీవోలు, పీవోలు, ఎంపీడీవోలు సదస్సులో పాల్గొన్నారు.

# కావాలనే కృత్రిమ బొగ్గు కొరత

హైదరాబాద్, అక్టోబర్ 15 సిరి న్యూస్:

రాష్ట్రంలో బొగ్గు, విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించి ఇప్పుడు అదే సంక్షోభాన్ని కుంటిసాకుగా చూపి విదేశీ బొగ్గు దిగుమతి పేరుతో సుమారు రూ.3,000 కోట్ల భారీ బొగ్గు కుంభకోణానికి తెరలేపడం అత్యంత దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాసిన లేఖలో తీవ్రంగా తప్పుబట్టారు. ఇటు సింగరేణికి ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా, అటు దేశంలో బొగ్గు వనరులు అందుబాటులో ఉన్నా దేశీయ సరఫరాను పెంచే దిశగా చర్యలు తీసుకోకుండా విదేశీ బొగ్గు వైపే మొగ్గు చూపడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. విద్యుత్ సంక్షోభాన్ని ముందస్తు ప్రణాళికతో ఎదుర్కోవాల్సిన ప్రభుత్వం, ఇప్పుడు కరెంట్ కోతలపై ప్రజలు, రైతుల ఆందోళనను బూచిగా చూపి దిగుమతులకు అనుకూలంగా మలుచుకోవడం వెనక భారీ స్కాం దాగి ఉన్నట్టు అర్థమవుతోందన్నారు. ఈ వ్యవహారంలో భోత్రా లాజిస్టిక్స్ అనే కంపెనీ పాత్ర అత్యంత అనుమానాస్పదంగా కనిపిస్తోందని, ఈ కంపెనీకి సింగరేణిలో కాంట్రాక్టులు అప్పగించడంలో అనుసరించిన ప్రమాణాలేమిటి? ఏ అర్హతల ఆధారంగా ఈ సంస్థను ఎంపిక చేశారు? టెండర్ల ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగింది? ఈ ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. లాజిస్టిక్స్ తో సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు, టెండర్ల వివరాలు, చెల్లింపులన్నింటినీ బహిర్గతం చేయాలి.. ఈ కంపెనీ ఎంపికకు కారణాలు, దానికి ఇప్పటి వరకు అప్పగించిన కాంట్రాక్టులు, చెల్లించిన నిధులపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. విదేశీ బొగ్గు దిగుమతుల వ్యవహారంలో ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారో ముఖ్యమంత్రి ప్రజలకు స్పష్టం చేయాలని కోరారు. టన్నుకు రూ.1,500 కమీషన్ చొప్పున ఏకంగా రూ.3,000 కోట్ల దోపిడీకి మీరు చీకటి ఒప్పందాలు చేసుకున్నట్టు అర్థమవుతోందన్నారు.

విద్యుత్ డిమాండ్ వేసవిలో పెరుగుతుందని, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతర బొగ్గు సరఫరా అవసరమని ప్రభుత్వానికి ముందే తెలుసు. గనుల అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాలు, బొగ్గు నిల్వలు, రవాణా, దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గిపోవడం ఈ సంక్షోభంలో కీలకమైన అంశమని. 2023-24లో సుమారు 70.02 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదు కాగా, 2025-26లో ఉత్పత్తి సుమారు 58 మిలియన్ టన్నులకు పడిపోయింది. ఇది మీ ప్రభుత్వ వైఫల్యం కాదా, మీ నిర్లక్ష్యానికి ప్రజాధనం వృధా చేసి భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితిని ఎందుకు సృష్టించారు అని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరగాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిల విషయంలోనూ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. గనుల అభివృద్ధికి, ఉత్పత్తి పెంపునకు అవసరమైన నిధులు అందించకుండా సింగరేణి సామర్థ్యాన్ని దెబ్బతీసి, ఆ తర్వాత దేశీయ బొగ్గు సరిపోవడం లేదని చెప్పడం మీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి కాదా? అని ప్రశ్నించారు. ఒడిశాలోని నైని బ్లాక్‌లో సింగరేణి బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన నేపథ్యంలో అక్కడి నుంచి సరఫరాను పెంచేందుకు ఏ చర్యలు తీసుకున్నారు? మహానది ప్రాంతం నుంచి బొగ్గు సరఫరా చేసుకునే అవకాశాలున్నా ఎందుకు చేయలేకపోయారో సమాధానం చెప్పాలని కోరారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు సరఫరా విషయంలోనూ మీ వాదనకు అర్థంలేదన్నది స్పష్టమైందన్నారు. 2018 ఫిబ్రవరి 15న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఎఫ్.నెం.23014/1/2018సీఎల్డీ ప్రకారం సింగరేణి గనుల నుంచి యాదాద్రికి సంవత్సరానికి 14 మిలియన్ టన్నుల జి9 గ్రేడ్ బొగ్గు సరఫరాకు లింకేజీ కేటాయింపు జరిగింది. 2022 ఏప్రిల్ 27న సరఫరాకు సంబంధించి ఒప్పందం కూడా కుదిరింది. మరి ఇప్పుడు బొగ్గు కొరత, నాణ్యత సమస్యల పేరుతో విదేశీ బొగ్గు దిగుమతుల అవసరాన్ని ఎందుకు ముందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో బొగ్గు, యాష్ హ్యాండ్లింగ్ వంటి పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించిన దుర్మార్గంపై మీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జెన్‌కోకు థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహణలో అనుభవజ్ఞులైన ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు ఉన్నారు. సుమారు 7,500 మెగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యం కలిగిన ప్లాంట్ల నిర్వహణ అనుభవం ఉన్నప్పుడు ప్రభుత్వ రంగ సంస్థల సామర్థ్యాన్ని వినియోగించకుండా ప్రైవేటు సంస్థలకు పనులు అప్పగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. కరెంట్ కోతలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెరిగినప్పుడు ప్రభుత్వం అధికారులపై నెపం నెట్టి తప్పించుకోవాలని చూడటం హేయమైన చర్య అన్నారు. నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విదేశీ బొగ్గు దిగుమతుల ప్రతిపాదనలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, రూ.3,000 కోట్ల బొగ్గు కుంభకోణంపై స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గుదలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలి.. సింగరేణికి రావాల్సిన బకాయిలపై సంస్థల వారీగా పూర్తి లెక్కలు ప్రకటించాలి.. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బొగ్గు సరఫరాపై స్పష్టత ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు.



# సంపద సృష్టికర్తలకు సహకారం

మొదటిపేజీ తరువాయి

గురువారంనాటి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో భౌగోళికంగా అనువైన ప్రాంతంలో ఉండటం, పారిశ్రామిక అవసరాలకు తగిన భూమి అందుబాటులో ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ద్వారా అభివృద్ధి చెందిన నైపుణ్యవంతమైన మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలాలని అన్నారు. హైదరాబాద్ వాతావరణం, బహుభాషా సంస్కృతి, వివిధ ప్రాంతాల ప్రజలను ఆదరించే సంప్రదాయం కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని పెట్టుబడులను తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్, ప్యూర్, రేర్ అనే మ□డు విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వాటి గురించి సవివరంగా భట్టి విక్రమార్క తెలిపారు.

**సంపద సృష్టిలో పారిశ్రామికవేత్తలదే కీలక పాత్ర**

మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో సంపద సృష్టికి వ్యవసాయంతోపాటు పరిశ్రమలు, సేవారంగం కీలకంగా మారాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో వ్యవసాయ రంగం వాటా సుమారు 16 శాతం ఉండగా, పరిశ్రమలు, సేవారంగం కలిపి ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా దోహదపడుతున్నాయని వివరించారు. సేవారంగం వాటా సుమారు 65 శాతంగా ఉందని, పారిశ్రామిక రంగం కూడా ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఫార్మా, కోర్ ఇండస్ట్రీలు, ఆక్వా, ఎగుమతులు, దిగుమతులు, ఐటీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు వంటి విభిన్న రంగాల్లో ఉన్న వ్యాపారవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింతగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టించే వారికి ప్రతి రాష్ట్రం, ప్రతి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు ఎదగడంతోపాటు రాష్ట్రానికి ఉపాధి, పెట్టుబడులు, ఆదాయం పెరగడానికి దోహదపడాలని ఆకాంక్షించారు.

**పరిశ్రమలకు ప్రభుత్వ అండ**

సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పెట్టుబడులకు అవసరమైన అనుమతులు, భూమి, విద్యుత్, నీరు వంటి సదుపాయాల కల్పనలో ప్రభుత్వ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయాలు, వ్యాపారం, సినీ పరిశ్రమ, వ్యవసాయం, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం తదితర అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందని చెప్పారు.

**అందరినీ కలుపుకుని అభివృద్ధి సాధించాలి**

సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమ అనుభవం, పరిజ్ఞానాన్ని ఇతర వర్గాలతో పంచుకోవాలని, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. సమాఖ్య వంటి సంస్థల ద్వారా ఈ తరహా కార్యక్రమాలకు వేదికలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కూడా వారితో కలిసి పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలికిన భట్టి విక్రమార్క వ్యాపారాలు విస్తరించుకుంటూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు సహకరించాలని కోరారు.

# నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలి

మొదటిపేజీ తరువాయి

ప్రమాదాలు, సైబర్ నేరాలపై సమీక్షించారు. బొల్లారం కైకూరులోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో ఐదు సంవత్సరాల పాప దారుణ హత్య ఘటన గుర్తు చేస్తూ నిందితుని అరెస్టు చేసినట్లు వివరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు నిరంతరం నిఘాతోపాటు సీసీ టీవీలు కమ్యూనిటీలో ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. దీంతో పాటు బొల్లారంలోని ఆయుధాల చోరీ కేసుకు సంబంధించిన అంశాలను కూడా ఆయన ప్రస్తావిస్తూ ఆయుధాల చోరీ కేసులో పటిష్టమైన దర్యాప్తుతో వెంటనే అరెస్ట్ చేసామన్నారు. కమిషనరేట్ పరిధిలో ఇళ్లల్లో దొంగతనాలు చేస్తూ దొంగతనాన్ని పాల్పడ్డ నేపాల్ గ్యాంగ్ సంబంధించిన వాటిపైన దృష్టి సాదించాలని, చోరీ కేసులు పటిష్ట నిఘాతోని నియంత్రించాలని ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలపై కళాశాలలు, గేటెడ్ కమ్యూనిటీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీజీపీ సూచించారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, ప్రమాదాల హాట్‌స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. కీసర, ఎల్‌బీనగర్, ఉప్పల్, బేగంపేట, జవహర్‌నగర్, మేడిపల్లి, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో ఆస్తి నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేరాల గుర్తింపు, సొత్తు రికవరీని మెరుగుపరచడంతోపాటు తీవ్రమైన నేరాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. మురికివాడలు, బస్తీల్లో నేరాల హాట్‌స్పాట్లను గుర్తించి, పునరావృత నేరాలకు పాల్పడేవారిపై బైండోవర్ చర్యలు చేపట్టాలన్నారు.

మహిళలు, బాలికల భద్రతకు పోక్సో చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని డీజీపీ సూచించారు. షీ టీమ్స్ సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జవహర్‌నగర్, హయత్‌నగర్, కుషాయిగూడ, వనస్థలిపురం, కీసర పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదవుతున్న పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేసులను క్షుణ్ణంగా సమీక్షించి, సాంకేతిక ఆధారాలతో సమర్థవంతంగా దర్యాప్తు పూర్తి చేసి, గడువులోగా చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. బాధితులకు పరిహారం అందేలా చూడటంతోపాటు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని స్పష్టం చేశారు.

**గస్తీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

పోలీసు స్టేషన్ల వారీగా నేరాల నమోదును విశ్లేషిస్తూ నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓలు) డయల్ 112 ఫిర్యాదులపై స్పందించడంతోపాటు గస్తీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తే నేరగాళ్ల కదలికలను నియంత్రించవచ్చన్నారు. పాత నేరగాళ్ల ఇళ్లకు వెళ్లి వారి ప్రస్తుత కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, రౌడీషీటర్లను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇందుకుగాను 1992 సంవత్సరంలోనే రౌడీలను, ఆర్గనైసేడ్ క్రైమ్స్ ను ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసినట్లుగా పేర్కొన్నారు.నేరం జరిగిన వెంటనే సంబంధిత బృందాలు రంగంలోకి దిగి ఆధారాలను సేకరించి, నిందితులను గుర్తించేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. డివిజన్ ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు, సెక్టార్ పోలీసులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు.

**కమిషనరేట్ పరిధిలో అక్టోబరు 13 నాటికి 2,474 కేసులు**

కమిషనరేట్ పరిధిలో 2026 అక్టోబరు 13 నాటికి 2,474 కేసులు నమోదైనట్లు సీపీ సుమతి వివరించారు. 2024లో 18,778 కేసులు నమోదు కాగా, 2025లో 18,480 కేసులు నమోదయ్యాయి. 2026లో ఇప్పటివరకు ఈ సంఖ్య 23,747కు చేరింది. ముఖ్యంగా దొంగతనాలు, మోసాలు, రోడ్డు ప్రమాదాలు, గాయపరిచే ఘటనలు పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.2026లో ఇప్పటివరకు 2,196 దొంగతనాల కేసులు నమోదయ్యాయి. 2024లో 1,484, 2025లో 1,662 కేసులు నమోదయ్యాయి. మోసాల కేసులు 2024లో 2,404 ఉండగా, 2025లో 2,636, 2026లో 2,789కు పెరిగాయి. గాయపరిచిన ఘటనలు 2024లో 1,311 నుంచి 2026లో 1,797కు చేరాయి. రోడ్డు ప్రమాద మరణాలు 2024లో 308, 2025లో 270 ఉండగా, 2026లో ఇప్పటివరకు 340 నమోదయ్యాయి. హత్యలు 2024లో 40, 2025లో 45, 2026లో 41గా ఉన్నాయి. కిడ్నాప్ కేసులు 2026లో 365కు చేరాయి. ఈ నేపథ్యంలో నేరాల నియంత్రణ, దర్యాప్తు, సొత్తు రికవరీపై పోలీసులు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.నేరాల గణాంకాలను విశ్లేషించి, పెరుగుతున్న నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీజీపీ అధికారులకు సూచించారు.

# బీమా అమలు చేయకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తాం

**సిద్దిపేట, అక్టోబర్ 15 సిరి న్యూస్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ కేసీఆర్ అమలు చేసిన రైతు సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేస్తున్నడని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. దేశం మెచ్చిన రైతు బీమా పథకాన్ని నిలిపివేసి రైతు కుటుంబాల ఉసురు పోసుకుంటున్నరని ఆగ్రహం వ్యక్తం చేసారు. సిద్దిపేటలో రైతు బీమా అందని 22 మంది రైతు కుటుంబాలతో క్యాంపు ఆఫీసు వేదికగా హరీశ్ రావు సమావేశమయ్యారు. వారితో కలిసి భోజనం చేసిన హరీశ్ రావు ఆయా కుటుంబాల స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. రైతు బీమా పథకం కింద రూ.5లక్షల సాయం అందకపోవడం వల్ల ఎదుర్కొంటున్న సమస్యల గురించి హరీశ్ రావుకు వారు వివరించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ రైతు కుటుంబాల ఆవేదన చూస్తే మనస్సు చలించి పోతున్నదన్నారు. ఆగస్టు 15 నుంచి ఈరోజు వరకు ఒక్క సిద్దిపేటలోనే 22మంది రైతులు చనిపోయారు.రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3వేల మంది రైతులు చనిపోయారు. రైతు బీమా నిలిపివేయడం వల్ల ఇప్పుడు ఆ మూడు వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రేవంత్ రెడ్డి కేసీఆర్ అమలు చేసిన పథకాలు కొనసాగిస్తున్నాం అని మాటలు చెప్పారు కానీ నిజానికి అన్నీ బంద్ చేస్తున్నారు. రైతు బీమా పథకం అమలు చేసి ఉంటే ఇంతమంది రైతు కుటుంబాలు ఎందుకు కన్నీళ్లు పెడుతున్నాయి.. వీరందరికి ఎందుకు రూ.5లక్షలు రాలేదు. ఆగస్టు 14 నుంచి ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రాష్ట్రంలో రైతు బీమా ఆగిపోయింది. ఇక్కడ కన్నీరు మున్నీరు అవుతున్న బాధితులకు మీరేం సమాధానం చెబుతారు? వీరిని ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందో చెప్పాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి, తుమ్మల వీరి బాధను ఎలా తీరుస్తారు? తుమ్మల నాగేశ్వరరావు ప్రాథమికంగా రైతు, మీరైనా ప్రీమియం చెల్లించాలని చెప్పాలి కదా. కొత్త పథకం తెస్తాం అని బడ్జెట్ లోచెప్పారు. ఆ పథకం ఇప్పటికీ అతీగతీ లేదు. గుంట భూమి వున్నా కేసీఆర్ పథకం వర్తింపచేసారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి పథకం వర్తింపచేసారు. మీరు చెప్పే పథకం ఇంటి యజమానికి మాత్రమే. ఐక్య రాజ్య సమితి సైతం మెచ్చుకున్న రైతు బీమా పథకాన్ని నిలిపివేసేందుకు మనసెలా వచ్చిందంటూ రేవంత్రెడ్డిని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలు మన పథకాన్ని చూసి అమలు చేస్తున్నా మీరు మాత్రం బంద్ చేసారు, ఏ కారణంతో చనిపోయినా రైతు కుటుంబం రోడ్డున పడొద్దని కేసీఆర్ రైతు బీమా అనే పథకానికి 2018లో రూపకల్పన చేసిండు. రైతుల తరపున ప్రభుత్వమే ఏటా రూ.1400 కోట్ల ప్రీమియం ఎల్ఐసీకి చెల్లించి రూ.5 లక్షల భరోసా కల్పించిండు. 2018-19 నుంచి 2023-24 వరకు వివిధ కారణాలతో మరణించిన 1,38,688 మంది రైతు కుటుంబాలకు రూ.7వేల కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించింది. రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పే రేవంత్ రెడ్డి.. ప్రీమియం రూ.1400 కోట్లు చెల్లించే తెలివి లేదా? వెంటనే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా రైతు కుంటుంబాలకు చెల్లించాలని, యదావిధిగా రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తే మీరు 8 గంటలు కూడా ఇవ్వడం చేతకావడం లేదు. ఐఎఎస్, అధికారులను సస్పెండ్ చేస్తాం అని ఎవరి చెవిలో పువ్వులు పెడుతున్నారు.

# మతం మారితే కుల రిజర్వేషన్ వర్తించదు: సుప్రీంకోర్టు

- **ముస్లిం బీసీ రిజర్వేషన్లపై తమిళనాడు ప్రభుత్వానికి ఎదురుదెబ్బ**
- **మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం**
- **మత మార్పిడితో కుల గుర్తింపు స్వయంచాలకంగా రాదని స్పష్టీకరణ**
- **2024లో తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన జీవోపై వివాదం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 సిరి న్యూస్:**

మతం మారినంత మాత్రాన మరో సామాజిక వర్గానికి చెందిన కుల గుర్తింపు, రిజర్వేషన్ అర్హతలు స్వయంచాలకంగా లభించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన వారికి ముస్లిం వెనుకబడిన తరగతుల (బీసీఎం) రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించే అంశంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ వ్యవహారంలో తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కుల ఆధారిత సామాజిక గుర్తింపు, రిజర్వేషన్ అర్హతలకు సంబంధించి వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది.

**వివాదానికి కారణమైన జీవో**

తమిళనాడు ప్రభుత్వం 2024 మార్చిలో జారీ చేసిన జీవో ఈ వివాదానికి కారణమైంది. వెనుకబడిన తరగతులు (బీసీ), అత్యంత వెనుకబడిన తరగతులు (ఎంబీసీ), డీనోటిఫైడ్ కమ్యూనిటీలు (డీఎన్‌సీ), షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) నుంచి ఇస్లాంలోకి మారిన వారు ముస్లిం వెనుకబడిన తరగతుల (బీసీఎం) కేటగిరీలో కమ్యూనిటీ సర్టిఫికెట్లు పొంది రిజర్వేషన్ ప్రయోజనాలు పొందేందుకు ఈ ఉత్తర్వులు వీలు కల్పించాయి. అయితే, ఈ నిర్ణయం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ జీవోను రద్దు చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

**మత మార్పిడితో కుల గుర్తింపు రాదు**

మతం మారినంత మాత్రాన వ్యక్తులు ఎదుర్కొంటున్న సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోదని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. వెనుకబడిన తరగతుల కమిషన్ సిఫారసుల ఆధారంగానే జీవో జారీ చేశామని, ఇప్పటికే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందుతున్నవారు మత మార్పిడి కారణంగా వాటిని కోల్పోకూడదనే ఉద్దేశం ఉందని వివరించింది. అయితే, తమిళనాడులో బీసీఎం కేటగిరీ కింద గుర్తించిన అన్సార్, దక్కనీ ముస్లింలు, దూదేకుల, లబ్బాయి, మాపిళ్ల, షేక్, సయ్యద్ వంటి ఏడు సామాజిక వర్గాల్లోకి మతం మారినంత మాత్రాన ఎవరూ స్వయంచాలకంగా చేరలేరని హైకోర్టు పేర్కొంది. ఆయా వర్గాల సామాజిక గుర్తింపునకు సంబంధించిన నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.

**కమ్యూనిటీ సర్టిఫికెట్ కోసం పోరాటం**

2015లో హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన సమీర్ అహ్మద్ అనే వ్యక్తి, తనకు ముస్లిం లబ్బాయి సామాజిక వర్గానికి చెందిన కమ్యూనిటీ సర్టిఫికెట్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ ఆ దరఖాస్తును తిరస్కరించడంతో ఆయన మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలోనే తమిళనాడు ప్రభుత్వం 2024లో జారీ చేసిన జీవో చట్టబద్ధతపై వివాదం తలెత్తింది. తాజాగా సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థించడంతో ఈ అంశంపై న్యాయపరమైన చర్చ మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది.

# నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై రేవంత్ సర్కార్ చర్యలు

**హైదరాబాద్, అక్టోబర్ 15 సిరి న్యూస్:**

తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలతో ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ సురేష్ నాయక్‌ను సస్పెండ్ చేసింది. మరోవైపు నిర్మాణ పనులను వేగవంతం చేసి, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు ఐదుగురు ఐఏఎస్ అధికారులను క్యాంప్ ఆఫీసర్లుగా నియమించింది. పనుల పురోగతి, నాణ్యత విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**ప్లాంట్ పనులపై ప్రత్యేక పర్యవేక్షణ**

నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని ప్రభుత్వం సమీక్షించింది. నిర్మాణంలో జాప్యం, పనుల నిర్వహణలో లోపాలపై దృష్టి సారిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంది. అక్టోబర్ 14న సాధారణ పరిపాలన శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. వీరు ప్లాంట్ ప్రాంగణంలోనే ఉంటూ సివిల్ పనులు, బొగ్గు సరఫరా మార్గాలు, విద్యుత్ తరలింపు కోసం గ్రిడ్ అనుసంధానం, కాంట్రాక్టు సంస్థల పనితీరును నిరంతరం సమీక్షించనున్నారు.

**విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం అప్రమత్తం**

రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ పెరగడం, సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. ప్లాంట్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులో ఉత్పత్తిని ప్రారంభించడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికారులకు బాధ్యతలు అప్పగించింది. వేసవిలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, టీజీఈఆర్‌సీ మార్గదర్శకాలకు అనుగుణంగా సంస్థలు సిద్ధంగా ఉండాలని సూచించారు. డిస్కంలకు నిధుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటూనే విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారించారు. యాదాద్రి ప్లాంట్ పనుల పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారులను రంగంలోకి దించడం, నిర్లక్ష్యంపై సస్పెన్షన్ వేటు వేయడం ద్వారా ప్రభుత్వం అధికారులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఈ చర్యలు ప్లాంట్ నిర్మాణాన్ని ఎంతవరకు వేగవంతం చేస్తాయి, రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఎంతమేరకు దోహదపడతాయన్నది కీలకంగా మారింది.

## పండగల వేళ నిరసనలతో
# వ్యాపారులకు నష్టం

- **దీపావళి వరకు ఆందోళనలకు అనుమతివ్వొద్దని అమిత్ షాకు వ్యాపార సంఘం లేఖ**
- **అక్టోబర్ 16న కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ నిరసన**
- **అక్టోబర్ 10 ఆందోళనతో రూ.2,000 కోట్ల నష్టం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 సిరి న్యూస్:**

వరుస నిరసనలు, ప్రదర్శనలతో పండగల సీజన్‌లో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఢిల్లీలోని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దసరా, దీపావళి సమయంలో రాజకీయ పార్టీల ఆందోళనల వల్ల మార్కెట్లకు వినియోగదారుల రాక తగ్గుతోందని పేర్కొంటున్నారు. దీపావళి ముగిసే వరకు రాజధానిలో నిరసనలు, ప్రదర్శనలకు అనుమతివ్వవద్దని కోరుతూ ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాసింది.

అక్టోబర్ 16న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్నాట్ ప్లేస్‌లో నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో వ్యాపార సంఘం ఈ అంశాన్ని లేవనెత్తింది. ఈ ఆందోళనతో కన్నాట్ ప్లేస్, జన్‌పథ్, ఖాన్ మార్కెట్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని సీటీఐ పేర్కొంది. రహదారులు దిగ్బంధమైతే వినియోగదారులు షాపింగ్‌కు రావడం తగ్గుతుందని, తద్వారా వ్యాపారాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేసింది.

**రూ.2,000 కోట్ల నష్టం అంచనా**

అక్టోబర్ 10న జరిగిన సీజేపీ నిరసనల కారణంగా ఢిల్లీలో లాక్‌డౌన్ తరహా పరిస్థితులు ఏర్పడ్డాయని సీటీఐ తెలిపింది. ఆ రోజు మార్కెట్లకు వినియోగదారుల రాక తగ్గడంతో సుమారు రూ.2,000 కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లినట్లు అంచనా వేసింది. నవరాత్రులు, దీపావళి వంటి కీలక పండగల సమయంలో ఇలాంటి ఆందోళనలు కొనసాగితే వ్యాపారాలపై మరింత ప్రభావం పడుతుందని పేర్కొంది. ఢిల్లీలో సుమారు 20 లక్షల మంది వ్యాపారుల జీవనోపాధిపై నిరసనల ప్రభావం పడే అవకాశం ఉందని సీటీఐ ఆందోళన వ్యక్తం చేసింది.

# సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి

- **కన్నాట్ ప్లేస్ ఆందోళనను అడ్డుకునేందుకు కోర్టు నిరాకరణ**
- **శాంతిభద్రతలు కాపాడాలని ఢిల్లీ పోలీసులకు ఆదేశం**
- **అభిజిత్ దీప్కే పిలుపుతో అక్టోబర్ 16న నిరసన**
- **సీజేపీ కోకన్వీనర్లకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 సిరి న్యూస్:**

ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టనున్న నిరసనను నిలిపివేయడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 16న జరగనున్న ఆందోళనను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకుంది. నిరసనను నియంత్రించడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని ధర్మాసనం నమోదు చేసింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన చట్టానికి అనుగుణంగా వ్యవహరించాలని పోలీసులను ఆదేశించింది.

పండగల సీజన్‌లో నిరసనల కారణంగా సెంట్రల్ ఢిల్లీలో దుకాణాలు మూతపడుతున్నాయని, దీంతో వ్యాపారులు నష్టపోతున్నారని కన్నాట్ ప్లేస్‌కు చెందిన వ్యాపారి తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఆందోళనలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ స్పందిస్తూ.. సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నామని, పిటిషనర్ ఆందోళనలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**అక్టోబర్ 16న సెంట్రల్ పార్క్‌లో నిరసన**

సీజేపీ కన్వీనర్ అభిజిత్ దీప్కే అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ వద్ద నిరసనకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, జాతీయ జెండాలతో రావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఇటీవల జంతర్ మంతర్ వద్ద జాతీయ జెండాలతో నిరసన తెలుపుతున్న సీజేపీ కోకన్వీనర్లు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. జంతర్ మంతర్ వద్ద ఆంక్షలు అమల్లో ఉన్న నేపథ్యంలో ఈ అరెస్టులు జరిగినట్లు తెలుస్తోంది.

**జాతీయ జెండాపై కొనసాగుతున్న వివాదం**

తమ నేతల అరెస్టుల నేపథ్యంలో సీజేపీ కొత్త నిరసనకు పిలుపునిచ్చింది. జాతీయ జెండాను ప్రదర్శించినందుకు జైలుకు పంపిస్తారా? అంటూ సీజేపీతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు, కన్నాట్ ప్లేస్‌లో నిరసన సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

# సీఎంపై వ్యాఖ్యలు.. నామా రమేష్‌పై కాంగ్రెస్ నేత ఫిర్యాదు




- **15 శాతం కమిషన్ ఆరోపణలు నిరాధారమన్న కొల్కూరి నర్సింహారెడ్డి**

**పటాన్‌చెరు, అక్టోబర్ 15 (సిరి న్యూస్):**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారంటూ ఆర్‌వీఎం కన్స్ట్రక్షన్ ఇండియా లిమిటెడ్ యజమాని నామా రమేష్‌పై కాంగ్రెస్ నేత కొల్కూరి నర్సింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం పటాన్‌చెరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవీందర్‌కు ఫిర్యాదు అందజేశారు. ప్రభుత్వ పనులు కావాలన్నా, పెండింగ్ బిల్లులు విడుదల కావాలన్నా 15 శాతం కమిషన్ డిమాండ్ చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వంపై నామా రమేష్ చేసిన వ్యాఖ్యలు పత్రికలు, టీవీ ఛానళ్లు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యాయని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు నిరాధారమైనవని, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటువంటి వ్యాఖ్యలతో ప్రజల్లో అపోహలు ఏర్పడి, శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని పేర్కొంటూ నామా రమేష్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు యువరాజ్, రవి, ముదిరాజ్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య రైతు.. అసాధారణ సేవ!



- **అన్నదానమే మహాదానం.. భక్తి మార్గంలో అంజిరెడ్డి పయనం**

**ఝరాసంఘం,అక్టోబర్ 15(సిరిన్యూస్ )**

సంపాదనలో సామాన్యుడు.. సేవలో అసాధారణుడు.. రైతు కుటుంబంలో ఉంటూనే ఆధ్యాత్మిక సేవలో తనదైన ముద్ర వేస్తున్న వ్యక్తి అంజిరెడ్డి. ఝరాసంఘం మండలం సంఘం(కె ) గ్రామానికి చెందిన అంజిరెడ్డి దసరా పండుగ సందర్భంగా తుల్జాపూర్ భవాని అమ్మవారి దర్శనానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు గత18 సంవత్సరాలుగా అన్నప్రసాద వితరణ చేస్తూ భక్తిభావాన్ని చాటుకుంటున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న ఆయన, తనకున్న స్థోమతలోనే భక్తులకు అన్నం పెట్టడాన్ని అమ్మవారి సేవగా భావిస్తున్నారు. అమ్మవారి నామస్మరణతో పాదయాత్ర సాగించే భక్తులకు అన్నప్రసాదం అందిస్తూ వారి ఆకలి తీర్చడం తన అదృష్టంగా భావిస్తున్నారు. హోదా గొప్పది కాదు.. చేసే సేవ గొప్పది, సంపద ముఖ్యం కాదు.. సేవాభావమే ముఖ్యం అన్న మాటలకు అంజిరెడ్డి సేవలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సామాన్య రైతుగా ఉంటూ అసామాన్యమైన సేవాభావాన్ని చాటుతున్న ఆయన, అన్నదానమే మహాదానమనే ఆధ్యాత్మిక సందేశాన్ని ఆచరణలో చూపిస్తున్నారు. భక్తికి సంపదతో సంబంధం లేదని, మంచి మనసుంటే సేవ చేయవచ్చని తన కార్యక్రమం ద్వారా చాటుతున్నారు. ఏళ్లుగా కొనసాగుతున్న ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిభావానికి, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తోంది.

# గ్రామాభివృద్దే లక్ష్యం శంశోద్దీన్ పూర్ సర్పంచ్ నరేష్



**రాయికోడ్, అక్టోబర్ 15(సిరిన్యూస్):**

తమ గ్రామాభివృద్దే లక్ష్యమని గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని శంశోద్దీన్ పూర్ సర్పంచ్ నరేష్ అన్నారు. గురువారం గ్రామపంచాయతీ నిధులతో బొంగుండేశ్వర కట్ట నుండి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల నరేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని సర్పంచ్ నరేష్ తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి మాజీ సర్పంచ్ టోపోల మానెమ్మ, పెద్దోడ్ల చౌదరప్ప, పెద్దోడ్ల నారాయణ, నాగోల మల్లయ్య,టోపోల రాములు, శీనంగల రాజు, రాసగొని నర్సింలు, టోపాల గోపాల్, బ్యాగరి రాములు, పులకంటి రాజప్ప, ర్యాకాలా నరసింహులు, పులకంటి శ్యామ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పూల పండుగకు విద్యుత్ కార్యాలయంలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**మెదక్, అక్టోబర్ 15 సిరి న్యూస్**



తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు మెదక్ జిల్లా విద్యుత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు మహిళల ఆటపాటలు సంప్రదాయ గీతాలతో కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకలకు మెదక్ మున్సిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు తంగేడు గునుగు తదితర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూల పరిమళాలు, మహిళల కోలాహలం, పండుగ సందడి కార్యాలయ ప్రాంగణాన్ని ప్రత్యేక ఆకర్షణగా నిలిపాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ
ఆత్మగౌరవానికి సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇలాంటి వేడుకలు మహిళల్లో ఐక్యతను పరస్పర ఆత్మీయతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతాయని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో బతుకమ్మ వేడుకలు సందడిగా సాగాయి. సంప్రదాయబద్ధమైన ఆటపాటల నడుమ నిర్వహించిన ఈ సంబరాలు కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపాయి.

# రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు పటాన్‌చెరు వేదిక

- **అండర్-17 రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు ప్రారంభం**
- **బందోబస్తు వైఫల్యంపై డీజీపీ, సీఎంకు ఫిర్యాదు చేస్తాం: ఎమ్మెల్యే**

**పటాన్‌చెరు, అక్టోబరు 15 (సిరి న్యూస్):**

పటాన్‌చెరును రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలతో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు. పటాన్‌చెరు మైత్రి మైదానంలో నిర్వహిస్తున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్17 బాలబాలికల రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణితో కలిసి ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన మైదానాలు, వసతులు కల్పిస్తూ క్రీడారంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని, అవసరమైన సదుపాయాలను సొంత నిధులతోనూ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

**బందోబస్తు వైఫల్యంపై ఫిర్యాదు**

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు తగిన పోలీసు బందోబస్తు కల్పించడంలో పటాన్‌చెరు పోలీసులు విఫలమయ్యారని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు హాజరయ్యే పోటీలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర డీజీపీతో పాటు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.




# కన్నుల పండుగగా బోనాల మహోత్సవం

- **శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో వనదుర్గాదేవి**
- **బోనం ఎత్తుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి**
- **అమ్మవారికి మహిళలు**
- **కుంకుమార్చన- విశేష పూజలు**

**పాపన్నపేట అక్టోబర్ 15 సిరి న్యూస్ :**





శ్రీ ఏడుపాయల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లో దేవీశరన్నవ రాత్రుల మహోత్సవాలు వైభవోపేతంగా అంగరంగవైభవంగా దుర్గానామ స్మరణలతో భక్తితన్మయంతో మారుమ్రోగుతున్నాయి. దేవీశరన్నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఐదవరోజైన గురువారం ఉత్సవ మండపంలో శ్రీ మహాలక్ష్మీ శ్రీస్కందమాత దేవీ అమ్మవారి అలంకారంలో పెసర పట్టు వస్త్రంలో వనదుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఉదయం ప్రధాన ఆలయంలో వన దుర్గాభవాని అమ్మ వారికి, గోకుల్ షెడ్ లోని ఉత్సవ మండపంలో శ్రీ మహాలక్ష్మిస్కందమాత దేవి అలంకారంలో ఉన్న దుర్గాదేవి అమ్మవారికి వేద బ్రాహ్మణ పండితులు ఆర్ శంకర్ శర్మ, పార్థీవశర్మ, మురళీధర్ శర్మ, రాజేశ్వర్ శర్మల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మండపంలో వేద పండితులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవ కార్యక్రమానికి ఆలయ ఈఓ వీరేశం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. బోనాల ఉత్సవంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత, మాజీ జెడ్పి చైర్మన్ తుల ఉమ లు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు చేశారు. శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో ఉన్న వన దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి భక్తుల పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఏడుపాయల్లో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలతో ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. ఏడుపాయల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ వీరేశం ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# ఇందిరమ్మ ఇళ్లు పేదల సొంతింటి కలకు సాకారం – ఆవుల రాజిరెడ్డి



**వెల్దుర్తి,అక్టోబర్ 15, (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలం హస్తాల్పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మించిన నూతన గృహాన్ని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రారంభించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని, ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి, భద్రతకు ప్రతీకలని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల కలలను సాకారం చేయడమే ఈ పథకం లక్ష్యమన్నారు.అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆవుల రాజిరెడ్డి స్పష్టం చేశారు. నూతన గృహంలోకి అడుగుపెడుతున్న కుటుంబానికి సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, నాయకులు సుధాకర్ గౌడ్, సత్తేందర్ రెడ్డి, తలారి మల్లేశం, ముక్తా బాయ్, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలి !

- **పంటల రక్షణకు రానున్న 15–20 రోజులు కీలకం**
- **నీటి సంరక్షణ, ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి**
- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**సంగారెడ్డి, అక్టోబర్ 15 (సిరి న్యూస్) :**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో చోటు చేసుకుంటున్న మార్పులు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రస్తుత పంటలను కాపాడేందుకు వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత, వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గురువారం సీఎస్ సంగారెడ్డి జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా సింగూరు జలాశయంలో నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ట్రాన్స్‌కో సీఎండీ జితేష్ వి.పాటిల్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సింగూరు జలాశయంలో నీటిమట్టం, జిల్లాలో తాగునీటి లభ్యత, వర్షపాతం, పంటల సాగు పరిస్థితులు, తాగునీటి సరఫరాకు రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికల గురించి సీఎస్‌కు వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. గ్రామాల వారీగా తాగునీటి అవసరాలను గుర్తించి, అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కార్యాచరణ ప్రణాళికలను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. అగ్రిమెంటేషన్ అవసరమైన పనులన్నింటినీ నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# తాగునీటికే మొదటి ప్రాధాన్యత





- **తాగునీటి, పంటల స్థితిగతులను పరిశీలించేందుకు పర్యటన**
- **ఎల్‌నినో ప్రభావంపై నేడు మంత్రి వర్గంలో చర్చ**
- **ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ చర్యలు**
- **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**
- **సింగూరు ప్రాజెక్టు సందర్శన**

**జోగిపేట, అక్టోబర్15,(సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం పర్యటించారు. పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టును సందర్శించి, హైదరాబాద్ జంటనగరాల తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా తీరును చీఫ్ సెక్రెటరీ పరిశీలించారు. సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయికి చేరుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో మిషన్ భగీరథ పెద్దారెడ్డి పేట ప్లాంట్ లో సమీక్ష నిర్వహించారు. రానున్న రోజుల్లో హైదరాబాద్లో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాకు కామారెడ్డి బాన్సువాడ నిజామాబాద్ పరిసర ప్రాంతాలకు సింగూరు నుండి నీటి సరఫరా జరిగేది. ప్రస్తుతం సింగూరు కనిష్ట స్థాయికి చేరుకోవడంతో నీటిఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. నీటి లభ్యత, సరఫరా పరిస్థితులు, ప్రత్యామ్నాయ చర్యలపై అధికారులతో చర్చించారు.

**ఫిబ్రవరి వరకు ఎల్‌నినో ప్రభావం**

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం చాలా తీవ్రంగా ఉందని మరియు ఫిబ్రవరి వరకు ఇది పీక్ స్థాయిలో ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మీడియాతో మాట్లాడారు.ఈ ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ స్థాయిలో చర్యలు జరుగుతున్నాయని, దీనిని ఇప్పటికే ముఖ్యమంత్రి కూడా సమీక్షించారని తెలిపారు. సాయంత్రం జరిగే క్యాబినెట్ సమావేశంలో కూడా దీనిపై విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.రాబోయే కాలంలో తాగునీటి పరిస్థితి మరియు పంటల స్థితిగతులను సమీక్షించేందుకు ఈ విజిట్ నిర్వహించినట్లు చెప్పారు. రాబోయే 15-20 రోజుల పాటు ప్రస్తుతం ఉన్న పంటలను (స్టాండింగ్ క్రాప్స్) రక్షించుకోవడానికి అన్ని శాఖలు కలిసికట్టుగా పని చేయాలని ఆదేశించారు. భూగర్భ జల మట్టాలు బాగా తగ్గిపోవడంతో, కరెంట్ ఇచ్చినప్పటికీ నీరు లభించని పరిస్థితి ఉంటుందని, అందువల్ల తాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సుల్తాన్‌పూర్ శివారులో పత్తిపంట పరిశీలన**

సుల్తాన్‌పూర్ శివారులోని గొల్ల మహేష్‌కు చెందిన పత్తి పంటను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, రాష్ట్ర జెన్‌కో సీఎండీ జితేష్ వీ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. వర్షాలు లేకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని రైతులు అధికారులకు వివరించారు. ఎకరాకు ఎంత పెట్టుబడి పెడతారని, ఎంత పంట దిగుబడి వస్తుందని, గత సంవత్సరం ఎలా ఉంది. ఈ సంవత్సరం ఎలా ఉందన్న విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు రూ.36వేల చొప్పున పెట్టుబడి పెడతామని రైతు శ్రీనివాస్ రెడ్డి అధికారులకు వివరించారు. కేవలం వర్షాధార పంట కావడంతో ఏమి చేయలేని పరిస్థితియని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. పంట మార్పిడి తప్పనిసరి చేయాలని అధికారులు సూచించారు.

# దేవి నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తే

## సకల శుభాలు కలుగుతాయి పూజారి రాజేశ్వర్ శర్మ

**తూప్రాన్ అక్టోబర్ 15 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలోని దేవి గార్డెన్ లో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి వ్యవస్థాపకులు పూజారి శలక రాజేశ్వర్ శర్మ మాట్లాడుతూ దేవి నవరాత్రులలో అమ్మవారిని నిష్టతో పూజిస్తే సకల శుభాలు కోరిన కోరికలు నెరవేరుతాయని నవరాత్రులలో అమ్మవారు రోజుకు ఒక్క అవతారంలో దర్శనం ఇస్తారని భక్తులను అనుగ్రహిస్తుందని ముఖ్యంగా లలిత త్రిపుర సుందరి దేవిని పూజిస్తే ఐశ్వర్యం సౌభాగ్యం కలుగుతుందని భక్తుల సహకారంతో 9 రోజుల పాటు చండి హోమం కుంకుమార్చన అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నామని భక్తులందరూ వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని పూజారి రాజేశ్వర్ శర్మ తెలిపారు ఉదయం నుండి చండి హోమం కుంకుమార్చన దేవి హారతి భక్తి పాటలతో అమ్మవారిని దర్శించుకున్నారు దేవి దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశారు.



# పంట ఎండి రైతు ఆత్మహత్య..




- **బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ మాధవనేని రఘునందన్ రావు....**
- **బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం...**

**నిరంతర 12 గంటల విద్యుత్ అందించాలని ప్రభుత్వానికి డిమాండ్..**

**శివంపేట్ అక్టోబర్ 15 (సిరి న్యూస్ )**

శివ్వంపేట మండలంలోని భీమ్లా తాండ గ్రామపంచాయతీ పరిధిలోని శంకర్ తండాలో మాలోత్ శంకర్ అనే రైతు తన వరి పొలం ఎండిపోయిందని బెంగపడి మనస్థాపంతో పొలంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని చనిపోవడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరైన విద్యుత్ ను అందించలేక పోవడంతో తాను సాగు చేసిన వరి పంటకు తగిన నీరు సరిపోలేక వరి పంట ఎండిపోయిందని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. మృతి చెందిన శంకర్ కుటుంబాన్ని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు వారి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అనంతరం ఎంపీ మాట్లాడుతూ శంకర్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని అలాగే తన కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి అశోక్ సాదుల, మండల అధ్యక్షులు పెద్దపులి రవి, భీమ్లా తాండ సర్పంచ్ లక్ష్మీ దుర్గ్య నాయక్, ఉప సర్పంచ్ కంస వెంకటేష్ నాయక్, జిల్లా కార్యదర్శి ఎరుకల భిక్షపతి, జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, మండల ఉపాధ్యక్షులు గోప్యానాయక్, దుబ్బ శేఖర్, మామిడి నర్సారెడ్డి, జిల్లా ఎస్టి మోర్చా కార్యదర్శి విట్టల్ నాయక్, శంకర్ తండా రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నిరంతరాయ విద్యుత్ అందించాలి





- **బీజేపీ కిసాన్ మోర్చా పాదయాత్ర, ధర్నా.. అధికారులకు వినతిపత్రం**

**సంగారెడ్డి, అక్టోబర్ 15 (సిరి న్యూస్):**

రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లెపల్లి రాజేందర్ రెడ్డి నేతృత్వంలో సంగారెడ్డి ఐబీ భవనం నుంచి సదరన్ ఎలక్ట్రిసిటీ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టి, విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రభుత్వం స్పందించి రైతులకు నిర్ణీత సమయానికి నిరంతరాయంగా విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వపురం లక్ష్మన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జేపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దేశ్పాండే, కులకర్ణి, జిల్లా నాయకులు రాశేకర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు రంజిత్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి

**సదాశివపేట. అక్టోబర్ 15. (సిరిన్యూస్)**

సదాశివపేట లోని శ్రీ కన్యక పరమేశ్వరి మందిరంలో శరన్నవరాత్రులలో భాగంగా గురువారం నాడు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. శ్రీ కన్యక పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన, లలిత సహస్రనామములు, మధ్యాహ్నం హారతి, పాల్గొన్న భక్తులందరికీ మహా ప్రసాదం వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.




# రామచంద్రాపురం ఈఎస్ఐలో ఆధునిక కీళ్ల చికిత్సలు..



- **రూ.19 లక్షల విలువైన ఆర్థోస్కోపీ కెమెరా వ్యవస్థ విరాళం..**
- **సీఎస్ఆర్ నిధులతో పరికరం అందజేత**

**రామచంద్రాపురం, అక్టోబర్ 15 (సిరి న్యూస్):**

కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రామచంద్రాపురం ఈఎస్ఐ ప్రాంతీయ ఆసుపత్రికి రూ.19 లక్షల విలువైన అత్యాధునిక ఆర్థోస్కోపీ హెచ్‌డీ కెమెరా వ్యవస్థను కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ సంస్థ విరాళంగా అందించింది. సంస్థ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన ఈ పరికరాన్ని సంస్థ జోనల్ హెడ్ లక్ష్మణ్ గూడా ప్రారంభించగా, బ్రాంచ్ మేనేజర్ అచ్యుతానంద పాల్గొన్నారు. ఈ పరికరంతో కీళ్ల సమస్యలు, లిగమెంట్ గాయాలకు ఆధునిక కీహోల్ శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు వీలవుతుంది. తద్వారా కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రమేష్ బాబు మాట్లాడుతూ.. రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రితో పాటు దాని పరిధిలోని 18 డిస్పెన్సరీల అభివృద్ధికి పరిశ్రమలు సీఎస్ఆర్ నిధుల ద్వారా సహకరించాలని కోరారు. వైద్య పరికరాలు, మౌలిక వసతుల కల్పనకు పరిశ్రమలు తోడ్పాటు నందిస్తే కార్మికులకు మెరుగైన వైద్యం అందించవచ్చని తెలిపారు. ఆసుపత్రికి పరికరాన్ని అందించిన కెన్ ఫిన్ హోమ్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ అనంతలక్ష్మి, ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి డాక్టర్ నటరాజు, డాక్టర్ రవి తేజతో పాటు ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుని కుటుంబ సభ్యులకు సర్పంచ్ నవీన్ గౌడ్ ఆర్థిక సహాయం

**రామాయంపేట, అక్టోబర్ 15 (సిరి న్యూస్)**

రామాయంపేట మండలం లక్ష్మపూర్ గ్రామం లో విద్యుత్ షాక్ తో మృతి చెందిన పేద కుటుంబానికి చెందిన రైతు నర్మల సిద్ధ రాములు కుటుంబానికి గ్రామ సర్పంచ్ గొల్లపల్లి నవీన్ గౌడ్ 5000 ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ నవీన్ గౌడ్ మాట్లాడుతూ ఆపద లో ఉన్నవారిని ఆదుకోవడం బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సంగయ్య, చేపూరి రామస్వామి , రాగుల శేఖర్ ,బాలరాజ్ ,చేపూరి స్వామి ,శివ , రంజిత్ శంకర్, సీద్ద రాములు, నాగరాజు, వార్డు సభ్యులు మల్లేశం, బిక్షపతి తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు



# సమోసాలో గుట్కా అవశేషాలు

**నర్సాపూర్ అక్టోబర్ 15 (సిరి న్యూస్)**

నర్సాపూర్ పట్టణంలో కల్తీ ఆహార పదార్థాల వ్యవహారం మరోసారి కలకలం రేపుతోంది. గత రెండు రోజుల క్రితం ఫుడ్ పాయిజన్ అయిన ఘటన వ్యవహారం మరువకముందే నర్సాపూర్‌లో తాజాగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో, బస్టాండ్ ప్రాంగణానికి ఎదురుగా ఉన్న సిటీ ప్యాలెస్‌లో విక్రయించిన సమోసాలో గుట్కా అవశేషాలు కనిపించాయంటూ ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి అయిన హనుమంతు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ లో కల్తీ ఆహారం సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మళ్ళీ ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని అన్నారు ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది హనుమంతు అస్వస్థతకు గురికావడంతో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నాణ్యతపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# ఎస్టీపీ నిర్మాణ స్థలంపై తెల్లాపూర్ గ్రామస్థుల అభ్యంతరం



- చింతబావి వద్ద నిర్మిస్తే అభ్యంతరం లేదని స్పష్టం.. -.
- ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే పనులు

**రామచంద్రపురం, అక్టోబర్ 15 (సిరి న్యూస్) :**

గ్రామానికి సమీపంలో హెచ్ఎండీఏ కేటాయించిన స్థలంలో ఎస్టీపీ (మురుగునీటి శుద్ధి కేంద్రం) నిర్మాణాన్ని చేపట్టడంపై తెల్లాపూర్ గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చింతబావి సమీపంలో నిర్మాణం చేపడితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై గురువారం నిర్వహించిన సమావేశంలో డీవైఈఈ రజిని పాల్గొన్నారు. గ్రామస్థుల అభ్యంతరాలను పరిశీలించిన ఆమె.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి నిర్ణయం మేరకే నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. దీంతో గ్రామస్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పలువురు గ్రామస్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# గీతంలో ప్రపంచ కూచిపూడి దినోత్సవం



- 'నాట్యోత్సవ 2026' పేరిట తన నాట్యశాస్త్ర కౌశలాన్ని ప్రదర్శించి, మన్ననలను అందుకున్న విద్యార్థులు

**పటాన్ చెరు, అక్టోబర్ 15, (సిరి న్యూస్):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని సంస్కృతి విద్యార్థి విభాగం గురువారం ప్రపంచ కూచిపూడి దినోత్సవాన్ని 'నాట్యోత్సవ 2026' పేరిట ఘనంగా జరుపుకుంది. పూజ్య గురువు, పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన సత్యం, కూచిపూడిలో ఆయన చిరస్థాయిగా నిలిపిన వారసత్వానికి నివాళులు అర్పించారు. ప్రార్థనా గీతంతో ఆరంభమైన ఈ కార్యక్రమం మంగళంతో ముగిసింది. బ్రహ్మాంజలి, జతీస్వరం, మురుగ శబ్దం, భామాకలాపం, తరంగం వంటి సంప్రదాయ కూచిపూడి ప్రదర్శనల ద్వారా తొమ్మిది మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. అభిగ్న మురుగ శబ్దం యొక్క భావ వ్యక్తీకరణ ప్రదర్శన, భామా కలాపంలో సత్యభామగా హర్ష పోషించిన అభినయం ప్రేక్షకుల నుంచి ఉత్సాహభరితమైన ప్రశంసలను అందుకుంది. నాట్య నివేదన వ్యవస్థాపకుడు, ముఖ్య అతిథి గురువు చిరంజయ్ పొద్దార్ కూచిపూడిలో నైపుణ్యం సాధించడానికి అవసరమైన కఠిన శిక్షణ, అంకితభావాన్ని గుర్తుచేసుకున్నారు. తమ గురువు డాక్టర్ వెంపటి చిన సత్యం కళారూపానికి చేసిన అమూల్యమైన సహకారాన్ని బహుదా ప్రశంసిస్తూ, సంప్రదాయ కళలను నేర్చుకోవడానికి, సంరక్షించడానికి భక్తి అవసరమని ఉద్ఘాటించారు. ఈ వేడుకలలో విదుషి అంజు అరవింద్, విద్వాన్ ఆనందు మురళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం



- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కి ఘన నివాళి

**పటాన్ చెరు, అక్టోబర్ 15, (సిరి న్యూస్):**

దివంగత రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పటాన్ చెరు పట్టణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గల ఆయన కాంస్య విగ్రహానికి పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పూలమాల వేసి వినమ్ర నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అత్యంత నిరుపేద కుటుంబం నుండి జీవితాన్ని ప్రారంభించి దేశానికి రాష్ట్రపతి అయ్యారని గుర్తు చేశారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, సీనియర్ నాయకులు పరమేష్, అశోక్, శ్రీధర్ చారి, మాదిరి పృథ్వీరాజ్, వెంకటేష్, ఆశమ్, కొండల్, శ్యాం, షకీల్, రామ్మోహన్, వీరారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాభివృద్ధికి కార్పొరేట్ చేయూత

- రూ.32 లక్షలతో నాలుగు అదనపు తరగతి గదులు..
- నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన

**రామచంద్రాపురం, అక్టోబర్ 15 (సిరి న్యూస్):**



ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం మరింత పెరగాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాశిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ రూ.32 లక్షల వ్యయంతో నిర్మించనున్న నాలుగు అదనపు తరగతి గదుల పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధులతో పాటు పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి రౌండ్ టేబుల్ ఇండియా వంటి సంస్థలు మరింత సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత, రౌండ్ టేబుల్ ఇండియా సైబరాబాద్ వన్ చైర్మన్ ప్రశాంత్, సంస్థ ప్రతినిధులు లక్ష్య జైన్, నిర్మల్ గుప్తా పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్స్ ప్రజలతో భాగస్వామ్యం కావాలి

- మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి ధ్యేయం.
- శానిటేషన్ పటిష్టంగా అమలు కావాలి.
- తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియను పటిష్టంగా అమలు పర్చాలి.
- నగరాభివృద్ధి పనులలో వేగం పెంచాలి.
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ అక్టోబర్,15(సిరి న్యూస్)**



మున్సిపల్ కమిషనర్స్ ప్రజా జీవనంలో ప్రజలతో భాగస్వామ్యం కావాలనీ జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అన్నారు.మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా శానిటేషన్ పై పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతూ తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ప్రజలు అందించే విధంగా అవగాహన కల్పించాలన్నారు.నగరాభివృద్ధి పనులలో వేగం పెంచాలని పరిసర పరిశుభ్రతకు నిలయాలుగా మున్సిపాలిటీలు తయారు కావాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ మందిరంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల మున్సిపల్ మున్సిపల్ కమిషనర్స్ మున్సిపల్ సిబ్బందితో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల సమగ్రాభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీలు ప్రగతి పథంలో నడవాలంటే కమిషనర్స్ ప్రణాళిక బద్ధంగా మున్సిపల్ సిబ్బంది సమగ్ర కార్య చరణతో ముందుకు నడుపుతూ శానిటేషన్ లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ మన మన పట్టణం, మన ఇల్లు మన పరిసరాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాపర్టీ టాక్స్ వసూలు చేసే విషయంలో లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు పోవాలన్నారు. నగరాభివృద్ధి పథకంలో భాగంగా ఎస్డిఎఫ్ సి , అమృత్,ఎస్బిఎం.మున్సిపల్ పెండింగ్ పనులు వేగం పెంచాలని,100 శాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మెదక్,నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్,మున్సిపల్ పరిధిలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేసి, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను 4 రకాలు గా వేరు చేయాలని ,త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని , వీధి దీపాలు క్రమం తప్పకుండా వెలగాలని, పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్,రామాయంపేట తూప్రాన్ నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల కొంగుబంగారం చిట్కుల్ శ్రీ తుల్జా భవాని అమ్మవారు

- భక్తుల కోరిన కోరికలు తీర్చే అమ్మవారు
- నవరాత్రులలో నిత్య అన్నదానం
- భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నాం
- ఆలయ వ్యవస్థాపకులు కే.జనార్ధన్ చారి

**పటాన్ చెరు, అక్టోబర్ 15, (సిరి న్యూస్):**





భక్తుల కొంగుబంగారంగా చిట్కుల్ శ్రీ తుల్జా భవాని అమ్మవారి దీవెనలు ఎప్పుడూ ఉంటాయని ఇక్కడి భక్తుల విశ్వాసం. దసరా పండగ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు నిత్య పూజలు అందుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ ఆదర్శ్ కాలనీలో 2018 సంవత్సరంలో వేప చెట్టు కింద స్వయంభుగా శ్రీ తుల్జా భవాని మాత వెలసింది. చిట్కుల్ శ్రీ తుల్జా భవాని ఆలయ వ్యవస్థాపకులు కే.జనార్ధన్ చారి ఆధ్వర్యంలో ఆలయంలో 2022 నుండి దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అదేవిధంగా ప్రతి శుక్రవారం ఐదుగురు భక్తులతో అన్నదాన కార్యక్రమం ప్రారంభమై, నేడు ప్రతివారం సుమారు 500 మంది భక్తులతో అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. 2022 నుండి విజయలక్ష్మి అమ్మవారు దసరా నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారి ఆలయంలో నిద్రాహారాలు, ఆహారం లేకుండా నవరాత్రి దీక్ష కొనసాగించడం విశేషం. అలాగే ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు చండీ హోమం కొనసాగుతుంది. భక్తులు ఆలయం చుట్టూ 11 ప్రదక్షణలు చేస్తే, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు జనార్ధన్ చారి మాట్లాడుతూ.. చిట్కుల్ ఆదర్శ్ కాలనీలో స్వయంభుగా వెలసిన శ్రీ తుల్జా భవాని మాత ఆలయంలో ప్రతి సంవత్సరం దసరా పండుగ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నామని తెలిపారు. అదేవిధంగా నవరాత్రులలో నిత్య అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విజయ దశమి రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసారని చెప్పారు. భక్తుల కోరికలు తీర్చ కొంగు బంగారం శ్రీ తుల్జా భవాని మాత అని ఇక్కడి భక్తుల ప్రగాఢ విశ్వాసం అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్నారని ఆయన తెలిపారు.

# సాయి రామ్ కుటుంబానికి 10 లక్షలు ఇవ్వాలి

- హోటల్, రెస్టారెంట్ లో పర్యవేక్షణ ఉండాలి
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ సారీ కాదు
- ఎంపీ రఘునందన్ రావు

**నర్సాపూర్ అక్టోబర్ 16 (సిరి న్యూస్)**



నర్సాపూర్ పట్టణంలోని వన్ ప్యాలస్ రెస్టారెంట్ లో ఫుడ్ పాయిజన్ తో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం ఎంపీ రఘునందన్ రావు బీజేపీ జిల్లా అధ్యక్షులు రాధా మల్లేష్ గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. రెస్టారెంట్లు నిర్వాహకులు ఆహార విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు రెస్టారెంట్లను తనకి చేయాలని వంటశాలలో పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు రెస్టారెంట్లను తనకి చేయాలని ఫుడ్ పాయిజన్ తో మృతి చెందిన సాయి కిరణ్ కుటుంబానికి పది లక్షల రూపాయలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీ పై విమర్శలు చేశారు జంతర్ మంతర్ వద్ద సీజేపీ నాయకులను అరెస్టు చేయడం అన్యాయం, నియంతృత్వం అని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు అనడం విడ్డూరమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్లను, రాజకీయ నాయకులను అరెస్టు చేశారని, ప్రొఫెసర్ కోదండరామిరెడ్డి నివాసం తలుపులు పగలగొట్టి అరెస్టు చేయడం భావ్యమేనా అని ప్రశ్నించారు.ఇందిరా గాంధీ జై తెలంగాణ అన్నందుకు 369 మందిని కాల్చి చంపారని అన్నారు ఓటు చోరీ జరిగిందంటూ ఆరోపణలు చేయడం ఎందుకని ఎంపీ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లితో పాటు మంత్రుల గ్రామాలకు వెళ్లి, ఎక్కడ ఓటు చోరీ జరిగిందో తెలుసుకుందామని సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం ఎన్నికలు నిర్వహిస్తే సతీష్ కుమార్ ముఖ్యమంత్రి అయ్యారని, అదే జ్ఞానేశ్ కుమార్ తెలంగాణలో ఎన్నికలు నిర్వహించినప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. అలాంటప్పుడు జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

# ఎక్సైజ్ దాడులలో మాదకద్రవ్యాలు స్వాధీనము

- 372 గ్రాముల ఆల్ప్రాజోలం, 13.23 గ్రాముల MDMA స్వాధీనం
- అదుపులో ఇద్దరు నిందితులు

**నర్సాపూర్ అక్టోబర్ 15 (సిరి న్యూస్)**

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ విక్రయాలను జరుగుతున్నాయి అని అందిన సమాచారం డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి, మెదక్ జిల్లా ఆదేశాల మేరకు గురువారం నర్సాపూర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తఫా స్థానిక ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 372 గ్రాముల ఆల్ప్రాజోలం, 13.23 గ్రాముల MDMA, ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఆగమయ్యల మోహన్ గౌడ్,కోటగిరి శ్రీకాంత్ గౌడ్ అరెస్ట్ చేసి నిందితులను అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు NDPS చట్టం ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు ఉంటాయని. నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోందని మాదకద్రవ్యాల మూలాలు, సరఫరాదారులు అక్రమ రవాణా నెట్‌వర్క్ పై దర్యాప్తు చేస్తున్నట్లు ఉన్నతాధికారుల ఆదేశాలను పకడ్బందీగా అమలు చేస్తూ, మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యువతను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించేందుకు ఎక్సైజ్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తూ, అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు ఉంటాయని అన్నారు ఈ దాడులలో హైదరాబాద్ STF ఇన్‌స్పెక్టర్ S. రమేష్, నర్సాపూర్ ఎక్సైజ్ స్టేషన్ SHO, సబ్ ఇన్‌స్పెక్టర్ D. శరత్ కుమార్, అండర్ ట్రైనింగ్ అధికారి జ్ఞానేశ్వర్ ఇతర ఎక్సైజ్ సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

# కరోనాలో ప్రాణాలు కాపాడిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలి.
- ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి నేరుగా వేతనాలు చెల్లించాలి.
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సంఘీభావం.
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి





**మెదక్ అక్టోబర్,15(సిరి న్యూస్)**

కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలందించిన జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సేవలు అమోఘమని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కరోనా విపత్కర సమయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలందించారని కొనియాడారు. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతంలో, ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి,వారి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర కూడా ఉందని,వారి సేవలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి నిరసన తెలుపుతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి,మధ్యవర్తి ఏజెన్సీల ప్రమేయం లేకుండా స్టేట్ హెల్త్ వ్యవస్థ ద్వారా ఉద్యోగులకు నేరుగా వేతనాలు చెల్లించాలని అన్నారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. ఉద్యోగులకు ఏటా ఐదు శాతం ఇంక్రిమెంట్, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చూపాలని సూచించారు.

**న్యాయమైన డిమాండ్ లను నెరవేర్చాలి.**

ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ఉద్యోగులు అందించిన సేవలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, వారిని క్రమబద్ధీకరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్,కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్,మాయ గంగామణి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, గంగా నరేందర్, శంకరంపేట మాజీ జెడ్పీటీసీ మాధవి రాజు, మెదక్,శంకరంపేట,పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు ఎం. అంజాగౌడ్,పట్లోరి రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి,నాయకులు కృష్ణ గౌడ్,లింగా రెడ్డి,ప్రభు రెడ్డి, మాయ. మల్లేశం,కిష్టయ్య,సాయి,ప్రభాకర్,సుదర్శన్,రవి, నరేందర్‌రెడ్డి,బీరయ్య, కసాపురం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలి






- పులిమామిడి రాజు.

**సదాశివపేట. అక్టోబర్ 15. (సిరిన్యూస్)**

తెలంగాణ వీరయోధుడు, ప్రజల పక్షాన నిలిచిన పోరాట యోధుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను సంగారెడ్డి జిల్లాలో అధికారికంగా, అత్యంత ఘనంగా నిర్వహించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు, సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో బిసి వెల్ఫేర్ అధికారి జగదీష్ కు వినతి పత్రం పులిమామిడి రాజు ఆధ్వర్యంలో సమర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 22న నిర్వహించనున్న పండుగ సాయన్న జయంతి ఉత్సవాలను జిల్లా యంత్రాంగం పూర్తి ప్రోటోకాల్‌తో నిర్వహించాలని పులిమామిడి రాజు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రాబిన్‌హుడ్ గా పేరుగాంచిన పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని, త్యాగాలను భావితరాలకు తెలియజేసేలా జయంతి వేడుకలను నిర్వహించాలని సూచించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 1217 జారీ చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లాలో కూడా వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. అదేవిధంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు నీలం మధుకు ఎమ్మెల్సీ పదవి కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు పులిమామిడి రాజు తెలిపారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించి, తగిన గుర్తింపు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మరియు తెర్పొల్ సర్పంచ్ సతీష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు జనార్ధన్, ఈశ్వర్, బొట్టు వెంకన్న, గుణాకర్, శ్రీనివాస్, తిర్మల్, రామ క్రిష్ణ, సాయి కిరణ్, ఆనంద్, గవ్వల కేశవ్, సుధాకర్, రాజేష్, బస్వరాజ్, మండల నాయకులు యువ నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు ఆత్మహత్యకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణం

- తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ అధ్యక్షులు దండే అపర్ణ
- సాగునీరు, సరైన విద్యుత్ లేక పంటలు ఎండిపోయి అప్పులపాలైన యువ రైతు



**శివంపేట అక్టోబర్ 15 (సిరి న్యూస్ ):**

వర్షాలు లేక, కాలానికి తగినట్లుగా సరైన విద్యుత్ సరఫరా అందక పంటలు ఎండిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై అప్పుల భారం తాళలేక బలవన్మరణానికి పాల్పడిన యువ రైతు మాలోత్ శంకర్ (45) కుటుంబాన్ని తెరాస (తెలంగాణ రక్షణ సేన) పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షురాలు, నర్సాపూర్ మొదటి శాసనసభ్యుడు గుండం వీరయ్య గారి మనమరాలు దండే అపర్ణ గురువారం రోజున పరామర్శించారు. శివంపేట మండలం భీమ్లా తండా గ్రామ పరిధిలోని శంకర్ తండాకు చెందిన రైతు మాలోత్ శంకర్ ఆత్మహత్య చేసుకున్నాడనే వార్త తెలుసుకున్న దండే అపర్ణ గారు హుటాహుటిన శంకర్ తండాకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా వారిని ఓదార్చి, కొండంత ధైర్యం చెప్పడమే కాకుండా ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దండే అపర్ణ మాట్లాడుతూ..రైతు మాలోత్ శంకర్ ఆత్మహత్యకు ముమ్మాటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సరైన విద్యుత్ సరఫరా లేక, సాగునీరు అందక పంటలు ఎండిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి కంటిమీద కునుకు లేక, చివరకు రైతన్నలు ఆత్మహత్యల బాట పడుతుంటే ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లువ్యవహరిస్తోంది." రైతాంగాన్ని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే మేల్కొని, మరణించిన రైతు మాలోత్ శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా రూ. 10 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని, అలాగే ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెరాస (తెలంగాణ రక్షణ సేన) పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమస్యలను సామరస్యంగా పరిష్కరించి అభివృద్ధి పనులు చేపడతాం

- దోమడుగు 19వ వార్డులో రూ.1.30 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం



**గుమ్మడిదల, అక్టోబర్ 15 (సిరి న్యూస్):**

ప్రజల అవసరాలకు అనుగుణంగా మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తూ, పనుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను సామరస్యంగా పరిష్కరించి ముందుకు సాగుతామని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు 19వ వార్డులో రూ.1.30 కోట్ల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనుల విషయంలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఆయన వార్డు కౌన్సిలర్లతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. దోమడుగు 19వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేపట్టినప్పటికీ, నిర్మాణానికి సంబంధించి పలు వివాదాలు తలెత్తడంతో పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ వార్డు కౌన్సిలర్లతో కలిసి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, సంబంధిత వర్గాలతో చర్చలు జరిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని వివాదాలకు పరిష్కారం చూపడంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చైర్మన్ తెలిపారు. దోమడుగు 19వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయితే స్థానికులకు రాకపోకల పరంగా ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గనున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని సామరస్యంగా పరిష్కరించుకుని పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అబిశెట్టి రాజశేఖర్, నర్సంపల్లి రాజిరెడ్డి, నాయకులు కృష్ణ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారతరత్న డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకలు



**తూప్రాన్ అక్టోబర్ 15 సిరి న్యూస్**

తూప్రాన్ సమీకృత భవనంలో తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం భారతరత్న డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి అబ్దుల్ కలాం అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు మిస్సెల్ మ్యాన్ గా శాస్త్రవేత్తగా రాష్ట్రపతిగా దేశ భివృద్ధిలో ఆయన పాత్ర మరువలేనిదని ప్రతి భారత పౌరుడు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో నయాబ్ తహసిల్దార్ శ్రీకాంత్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్ నవీన్ రెవిన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పుష్పనగేష్



**రామచంద్రాపురం, అక్టోబర్ 15 (సిరి న్యూస్):**

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీ, కాశిరెడ్డిపల్లిలో ఉన్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.

# అక్రమంగ ఆవులను ఎద్దు రవాణాపై కేసు నమోదు



**తూప్రాన్ అక్టోబర్ 15 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలో అక్రమంగా ఆవులను ఎద్దు తరలిస్తున్న వాహనాన్ని తనిఖీ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల మేరకు గురువారం తెల్లవారుజామున అక్రమంగా రవాణా చేస్తున్న ఆవులను ఎద్దు స్వాధీనం చేసుకొని డ్రైవర్ ఖాదర్ ను వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గంగరాజు తెలిపారు

# రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు కొండపాక మోడల్ స్కూల్ విద్యార్థులు

- అండర్-14 విభాగంలో ముగ్గురికి అవకాశం

**గజ్వేల్ అక్టోబర్ 15 (సిరి న్యూస్ )**

ఏస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 14 రగ్బీ పోటీలకు కొండపాక తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. తొమ్మిదో తరగతి చదువుతున్న అఖిల్, రామ్, తరుణ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని వీఎం హోమ్‌లో జరిగే పోటీల్లో వారు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. విద్యార్థుల ఎంపికపై మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ నాగార్జునసాగర్, పీఈటీ భరత్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులను అభినందించారు.



# లలిత త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి అలంకరణ

**రామచంద్రాపురం, అక్టోబర్ 15 (సిరి న్యూస్):**



దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామచంద్రాపురం మల్లికార్జున్ నగర్ కాలనీలోని దుర్గాభవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని లలిత త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# అక్రమ కట్టడాలు తొలగింపు



**వెల్దుర్తి, అక్టోబర్ 15,(సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలంలోని కుకునూరు గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టినట్లు గుర్తించిన అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు అట్టి ప్రహరీ గోడ నిర్మాణాన్ని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి సమన్వయంతో జేసీబీని వినియోగించి నిర్మాణం తొలగింపు ప్రక్రియను పూర్తి చేశారు. ఈ చర్యల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్ఐ పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారు. ఇకనైనా ఎవరైనా అక్రమ నిర్మాణలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



# బొంతపల్లిలో దుర్గాభవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు



- **అమ్మవారి కృపతో మున్సిపాలిటీ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి: చైర్మన్ కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, అక్టోబర్ 15 (సిరి న్యూస్):**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గాభవాని అమ్మవారిని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆయన వార్డు కౌన్సిలర్లతో కలిసి అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దుర్గాభవాని అమ్మవారి కృపాకటాక్షాలతో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని, గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బొంతపల్లిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శనం చేసుకుంటున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, ఉత్సవ నిర్వాహకులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన వైభవంగా

# దేవీ నవరాత్రి మహోత్సవాలు

- **వివిధ అలంకారాల్లో అమ్మవార్ల దర్శనం**
- **ఆలయాలకు పోటెత్తిన భక్తులు**
- **ఐదో రోజు ప్రత్యేక పూజలు**
- **భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లింపు**

**గుమ్మడిదల, అక్టోబర్ 15 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని గ్రామ గ్రామాన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని మంబాపూర్, కానుకుంట గ్రామాలతో పాటు గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని గుమ్మడిదల, బొంతపల్లి, అన్నారం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం అమ్మవార్లను వివిధ రూపాల్లో అందంగా అలంకరించి భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తున్నారు.

**వివిధ అలంకారాల్లో అమ్మవార్ల దర్శనం**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో అమ్మవార్లను రోజుకో ప్రత్యేక రూపంలో అలంకరించి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఐదో రోజు అమ్మవార్లను వివిధ అలంకారాల్లో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజలు, అర్చనలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవార్ల దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయాల్లో అందజేసిన తీర్థప్రసాదాలను స్వీకరించారు.

**భక్తులతో సందడిగా ఆలయాలు**

నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవార్ల దర్శనం కోసం పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివస్తున్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారుతున్నాయి. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామాలు సుభిక్షంగా వర్ధిల్లాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.




**భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు**

నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆయా ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. భక్తులు సులభంగా అమ్మవార్లను దర్శించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలు ముగిసే వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రానున్న రోజుల్లోనూ నవరాత్రి ఉత్సవాలు మరింత వైభవంగా కొనసాగనున్న నేపథ్యంలో అమ్మవార్ల దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది.

## లలితా త్రిపుర సుందరి దేవిగా

# భద్రకాళి అమ్మవారు

- **బొంతపల్లిలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు**
- **అమ్మవారిని దర్శించుకున్న భక్తులు**

**గుమ్మడిదల, అక్టోబర్ 15 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఐదో రోజు భద్రకాళి అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి పూజలు సమర్పించారు. లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో



ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఉత్సవాలు కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది.

# దివ్యాంగులకు సహాయ పరికరాల అందజేత



- **దివ్యాంగులు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి**
- **367 మంది దివ్యాంగులకు వివిధ రకాల పథకాల ద్వారా లబ్ధి**
- **రామాయంపేటలో సందడి చేసిన దివ్యాంగులు**
- **ప్రత్యేక చొరవ తీసుకున్న మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు**

**రామాయంపేట, అక్టోబర్ 15 (సిరి న్యూస్) :**

దివ్యాంగులు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగి గౌరవ ప్రదమైన జీవనం సాగించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని మెదక్ ఎంపీ మాధవేని రఘునందన్‌రావు అన్నారు. దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రామాయంపేటలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 367 మంది దివ్యాంగులకు వివిధ రకాల సహాయక పరికరాలు, సంక్షేమ పథకాల లబ్ధిని అందజేశారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ.. దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. దివ్యాంగుల అవసరాలను గుర్తించి, వారికి ఉపయోగపడే సహాయక పరికరాలను అందించడం ద్వారా వారి దైనందిన జీవితాన్ని సులభతరం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించాలని, వారికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ హేమ భార్గవి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, మెదక్ జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిమ్మనమైన శ్రీనివాస్, బీజేపీ మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, విహెచ్పి జిల్లా మాజీ అధ్యక్షుడు, బిజెపి పార్టీ నాయకుడు పబ్బ సత్యనారాయణ గుప్తా, దిశా కమిటీ మెంబర్, రామాయంపేట మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు అవినాష్‌రెడ్డి, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, దంతేపల్లి సర్పంచ్ బాలరాజ్, లక్ష్మాపురం సర్పంచ్, రామాయంపేట మండల పార్టీ అధ్యక్షుడు నవీన్ గౌడ్, రాంపూర్ సర్పంచ్ ప్రవీణ్, నిజాంపేట సర్పంచ్ నరేందర్, రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ గౌడ్, పార్టీ నాయకులు, కన్నయ్య, నిజాంపేట మండల అధ్యక్షుడు సిద్ధారామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

**మెదక్ అక్టోబర్,15(సిరి న్యూస్)**



వేద పండితుల మంత్రోచరణాలు... భక్తుల జయజయ ధ్వానాల మధ్య పట్టణంలోని కుమ్మరిగడ్డ అనాది హనుమాన్ దేవాలయంలో శ్రీ సంతోషిమాత 41 వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. దేవి శరణన్నవరాత్రుల్లో భాగంగా గురువారం ఆలయంలో సంతోషిమాతకు అభిషేకం, దుర్గామాతకు పంచామృతాభిషేకం, అనంతరం చండీ హవనం నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీమాత మాలదారులు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అరునార్తి వెంకట రమణ, భట్టి ఉదయ్, రా రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షులు వీరేశం, వేద పండితులు భరత్ శర్మ,వైద్య రాజు, వైద్య శ్రీనివాస్,మధుసూదన్, దోర్బల రాజమౌళి, ప్రసాద్, సాయి సుధీర్, స్థానికులు గౌత శేఖర్, అరునార్తి చంద్ర శేఖర్, తొడుపునూరి హరినాథ్,పెండ్యాల చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి కల్యాణ మహోత్సవం!

- **భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం, అన్నప్రసాద వితరణ!!**

**శివంపేట అక్టోబర్ 15 ( సిరి న్యూస్ )**

శివంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శ్రీ నవదుర్గాదేవి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో గ్రామ పురోహితులు చండి పంతులు ఆధ్వర్యంలో, భవానీ ఉత్సవ కమిటీ సహకారంతో శ్రీశ్రీ శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించారు. అమ్మవారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని భక్తులు ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు, భవానీ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.